


# జిల్లా ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**
**నవతెలంగాణ-సిద్ధిపేట**

తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతూ.. ఈ ఉగాది మీ కష్టాలకు ముగింపు మీ విజయాలకు ఆరంభం కావాలని కోరుకుంటూ నానని అన్నారు.

**పంచాంగ శ్రవణంనాకు హాజరు కానున్న హరీశ్‌రావు...**విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకొని సిద్దిపేట పట్టణం కోటిలింగాలగుడి వెనక ఉన్న బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ సదనం భవనంలో "ఉగాది ఉత్సవం " జరుగుతుందని, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

## ఉగాది

**నవతెలంగాణ-సిద్ధిపేట**

ఆ.వె:- చైత్రమాసమొచ్చె చైతన్య క్రాంతి తో
పాడ్యమందు వచ్చె పర్వదినము
షడ్రుచులనుగాది సౌఖ్యమ్ము నీయగ
శ్రీ విశ్వావసొచ్చె శ్రియము గూర్చ !
ఆ.వె:- తీపి వగరు పులుపు వేప పూవు రుచులు
కొత్త కుండ లోన కొలువు దీరి
ఆరు రుచులు గలిసి యారోగ్య మందించు
అవని జనుల కిదియె నమృత సమము!
ఆ.వె:- పప్పు భక్షములును పచ్చడి రుచులును
మామిడి పులిహోర మాకు ప్రీతి
ఎన్ని రుచులు వున్న యెన్నగా మిన్నగా
అమ్మ చేతి వంట అద్భుతమ్ము



**కవయిత్రి... కొడిచెల్లి రామానుజ,**
తెలుగు భాషోపాధ్యాయురాలు,
సిద్దిపేట.

# అక్రమంగా డబ్బులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి**
**నవతెలంగాణ-సిద్ధిపేట**



బెస్ట్ అవైలబుల్ అడ్మిషన్ల పేరిట పేద విద్యార్థులు తల్లితండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, దళిత పేద వారికి ఉచితంగా రావాల్సిన విద్యను డబ్బులను వసూలు చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డిలు అధికారులను డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. జిల్లా అధికారి కవిత నేతృత్వంలో జరుగుతుందని, పూర్తిగా విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీడీడీ ఆఫీస్ మొత్తం జిల్లా అధికారి కవిత కబంధహస్తాల్లో నడుస్తుందని, ప్రతి పనికి వాటాలు అప్పజెప్పే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ ఆర్థిక సహాయంలో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారని, స్కాలర్ షిప్స్ అప్లికేషన్స్, బిల్లులు మంజూరు చేయాలన్న ప్రతి దాంట్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారని, ఆమెపై అనేక ఆరోపణలు ఉన్నాయని విజిలెన్స్ అధికారులచే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో జిల్లా ఉపాధ్యక్షుడు తడూరి భరత్ కుమార్ , కోనేరు ప్రవీణ్ , జిల్లా సహాయకార్యదర్శి సంతోష్, నాయకులు రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కోకిల నేలకై రాకు

అప్పుడెప్పుడో ఎగిరిన కోకిల
వసంత మాసమని నేలకై తొంగి చూసింది
తన మధుర స్వరాన్ని వినిపించాలని
జన హృదయాలను పులకించాలని ఆమనికి అర్థమయ్యింది
తన గానము ఎవరు ఆస్వాధించ లేరని
తన గోడును ఎవరు వినిపించుకోరని శిరము వెళ్ళి వసంతము వచ్చింది
రుతువు, రుతువున క్రతువు మారింది
కాని, శిశరము, శిశిరముగానే మిగిలింది ఆర్ధత హృదయాలు ఆరిపోయాయి
ఎండిన డెందాలు మిగిలిపోయాయి. చాచే చేతులు మొండి బారాయి.
స్రవించే కళ్ళు నిర్ఘాంత పడ్డాయి పలుకరించే పెదాలు మూత బడ్డాయి
చైతన్యము అటకెక్కింది ఆస్వాధించే హృదయము శిలగా మారింది.
మానవత్వము మంట కలిసింది కొత్త చరిత్రకు శ్రీకారము చుట్టింది

ఇప్పుడు మానవ చరిత్ర అంటే రక్తాన్ని త్రాగడము
నెత్తురంటకుండానే సమాధులు కట్టడము
కత్తులు లేకుండానే కుత్తుకలు కోయడము మనిషికి, మనిషికి మధ్య
అడ్డుకోడలు వేయడము ద్రవ్యాన్ని, ద్రవ్యముతో కొలవడము
ముఖిలించడము, విఖిలించడము
కోకిల నువు రాకు
గగనాన విహంగాలతో.
రెప్పలు విప్పార్చుకొని ముచ్చటించు.



**తాటి కిషన్, గజ్వేల్ కవి**
**9052454349**
**నవతెలంగాణ-గజ్వేల్**

## విశ్వావసు నామ సంవత్సరం ఉగాదికి స్వాగతం

**నవతెలంగాణ-తొగుట**

కం..
విశ్వావసు వత్సరమున
విశ్వమునకు శుభము గలుగ విష్వక్సేనుం
డైశ్వర్యము నొసగు సతము
శాశ్వత సుఖములను బడయ సర్వ జనంబుల్!!
ఉ..
పచ్చని తోరణాల్ తెలుగు వాకిలు లన్నిట వెల్లులీనగా
వెచ్చని పిల్లవాయువులు వీయుచు నుండగ మత్తకోకిలల్
పొచ్చెములేక కూయుచును ముందుగ
స్వాగతమంచు పల్క తా
వచ్చె నుగాది పండుగయె వైభవ లక్ష్మిని వెంట దోడుకన్!!
కం..
విశ్వాసము హెచ్చుచు, నీ
విశ్వావసు వత్సరమున విజ్ఞానముతో
నైశ్వర్యము నార్జించుచు
శాశ్వత కీర్తిని బడసెరు సత్కర్మలతో!!
ఉ.
శ్రీ విలసిల్లి మెండుగ విశేషవినోద విశాలమైన,స
ద్భావన నుప్పతిల్ల పెరవారికి సాయమొనర్చుచున్ భళా!
పావనులై ధరాస్థలిని భాసిలు చుండగ మానవాళి, వి
శ్వావసు వత్సరంబున
ప్రశాంతత హెచ్చునటంచు నెంచెదన్!!
కం..
రవి రాజైనందు వలన
నవినీతి నశింపజేయ నధి కారులలో
స్తవనీయత పెంపెందుచు
ప్రవిమలగతి భారతంబు భాసిల్లునహో!!

**సహజకవి అష్టావధాని**
**బండకాడి అంజయ్య గౌడ్**
**9963418686**

## ప్రకృతి పరవశం

కదులుతున్న కాలగమనానికి
దీర్ఘ యశస్సు చిగురింతలు
కొత్త పూత కొంగ్రొత్త ఆశలై
ఫలాల సవ్వడికి ప్రతిరూపం
ప్రతి యేడు ఉగాది నిత్య నూతనత్వం
పంచాంగ శోభలతో పావన చరితం
నిత్య కళ్యాణ పచ్చ తోరణమై
పంచ భక్షాల పరమాన్న బోనమై
నూతన యేడు నిలువెల్ల నందనం
నింగి నేలకు శోభలై బాటలు
ప్రకృతాంబ ఒడిన
ఫరిడవిల్లు కాంతులు
విశ్వవసునామ వత్సర రవళులు
తెలుగు పూదోటన వెల్లివిరియు మల్లెలు
ఉగాది పర్వం నిత్య నూతనత్వము
విజ్ఞాన కాంతులై పూయును విశ్వం



**కవి ...ఉండ్రాళ్ళ రాజేశం, సిద్దిపేట,**
**9966946084.**
**నవతెలంగాణ-సిద్దిపేట**

## తెలుగు సంవత్సర విశిష్టత

**నవతెలంగాణ-సిద్ధిపేట**

పచ్చ పచ్చని పకృతిలో
చెట్లు చిగురించే వేళ
కోకిల సవ్వడి ఆనందించే వేళ
వచ్చింది వచ్చింది విశ్వ వాసు ఉగాది! !
భారతీయ పండగల విశిష్టత
తెలుగు సంవత్సర ఉగాది అని తెలిపింది
అందరి హృదయంలో ఆనందం నింపింది
షడ్రుచుల పచ్చడి తీపి చేదు కారం పులుపు వగరు
మనిషి కష్ట సుఖాలకు సమానమని తెలిపింది
" మామిడి ఆకుల తోరణాలతో
మన ఇంటి కోవెలను తీర్చిదిద్దింది
కొత్త ఆశలు చిగురించి
రైతన్న పాడి పంటలతో
సుఖంగా ఉండాలని దీవించింది
" అతివృష్టి అనావృష్టి లేకుండా
అందరి మేలు చూడమని
విశ్వ వాసు ఉగాది భగవంతుని కోరింది! !
స్వాగతం సుస్వాగతం
విశ్వ వాసు ఉగాదికి కోకిల రాగంతో
పచ్చని చెట్లపై పక్షుల సవ్వడితో
ఇంటింటా పల్లె పల్లె
ఆ బాల గోపాలం వరకు
ఆనందం నింపింది ఈ ఉగాది! !
తెలుగు వాడవైనా వెయ్యవోయ్
ఒక ఈల ఈ ఉగాది వేల
పండగ పసందైన ఉత్సవానికి
తెలుగువారి తెలుగు పండగ
తెలుగువారి ఘన కీర్తి తెలిపే ఉగాది! !



**రచయిత : -కొమురవెల్లి నరసింహులు,**
గ్రామం మర్పడగ, మండలం కొండపాక, జిల్లా సిద్దిపేట.

## సెంట్రల్ జైలులో జిల్లా జడ్జి ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-కంది

మండలంలో గల సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్రూంలను పరిశీలించారు. జైలు ఆవరణ మొత్తం తిరిగి పర్యవేక్షించారు. జైలులోని సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి ఖైదీలను తెలుసుకున్నారు.ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్‌కి తెలిపారు. సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఖైదీలను అడిగారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్, జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో బైక్ దొంగల బీభత్సం

నాలుగు బైకులు ధ్వంసం.. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని ఒకటో వార్డులో శుక్రవారం అర్ధరాత్రి బైక్ దొంగలు కలకలం సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న 4 బైక్‌లను దుండగులు బండ రాయితో ధ్వంసం చేసి పెట్రోల్, ఇతర పార్ట్స్‌ను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ గ్రౌండ్ పక్కన నివాసముండే రవీందర్ రెడ్డి స్కూటీని ధ్వంసం చేశారు. పక్కనే కిరాయి ఉండే కూసంగి సంతోష్ కుమార్ అనే టీచర్‌కు చెందిన యూనికాన్ బైకును ధ్వంసం చేసి పెట్రోల్ దొంగలి ంచారు. రుమాండ్ల రమేష్ బైకును ధ్వంసం చేసి పెట్రోల్ దొంగతనం చేశారు. గడ్డమొల్ల గోపాల్‌కు చెందిన స్కూటీని ధ్వంసం చేసి వెళ్లిపోయారు. ఈ విషయమై జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## విషగుళికల నీరు తాగి 10 మేకలు మృత్యువాత



నవతెలంగాణ-వట్‌పల్లి

విష గుళికలు కలిపిన నీటిని తాగి 10 మేకలు మృతువాత పడ్డాయి. ఈఘటన వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలోని మేడికుంద శివారులో శుక్రవారం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల తాండాపరిధిలోని మేడికుందతాండాకు చెందిన బూరిబాయి, వాకాదోత్ శాంతాబాయి అనే ఇద్దరు రైతులు తమ జీవాలను మేత కోసం తాండా సరిహద్దు ప్రాంతానికి తోలుకెళ్లారు. అయితే మేడికుంద శివారులోని రైతు మాధవి తన వ్యవసాయ పొలం వద్ద దొంగలు పైపులు పలు రకాలైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. దాంతో వారి నుంచి వ్యవసాయ సామగ్రిని కాపాడుకోవాలని విషగుళికలను నీటిలో కలిపి గిన్నెలో ఉంచి పొలం దగ్గర పెట్టింది. అయితే ఆ జీవాలు అనుకోకుండా ఆ నీటిని తాగడంతో బూరిబాయివి 6, శాంతాబాయివి 4 మేకలు మృత్యువాత పడ్డాయి. అయితే ఒక్కో మేక రూ.10వేలకు పైగా ఉంటుందని బాధిత రైతులు వాపోతున్నారు. ఈ విషయమై రైతు మాధవిని అడగ్గా.. తన పంట సామగ్రి రక్షణ కోసం అలా చేసినట్టు చెప్పుకొచ్చారు.

## న్యాయవాది నిజామోద్దీన్ రషీద్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి బార్ అసోసియేషన్‌కి జరిగిన ఎన్నికల్లో గ్రంథాలయ కార్యదర్శిగా ఎన్నికైన న్యాయవాది మొహమ్మద్ నిజామోద్దీన్ రషీద్‌ను ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మహేంద్ర మాట్లాడుతూ.. యువ న్యాయవాదిగా సంగారెడ్డి బార్ అసోసియేషన్‌కి గ్రంథాలయ కార్యదర్శి గా ఎన్నిక కావడం అభినందనియమన్నారు. న్యాయవాదులకు, కొత్తగా న్యాయ వాద వృత్తిలోకి వచ్చే వారికి సంగారెడ్డి బార్ అసోసియేషన్ గ్రంథాలయంలో కీలక తీర్పుల సమాచారంతో పాటు న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులు, సంస్కరణలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి బార్ అసోసియేషన్‌కి మంచి గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి బార్ అసోసియేషన్‌కి క్రీడాల కార్యదర్శిగా ఎన్నికైన టి.శ్రీనివాస్‌కి సైతం శుభాకాంక్షలు తెలిపారు. ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి సహా కార్యదర్శి గడ్డం శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ వర్గాలకు న్యాయ అవగాహనా సదస్సు




నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆధ్వర్యంలో వివిధ వర్గాల ప్రతినిధులకు న్యాయ అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.భవానిచంద్ర మాట్లాడుతూ.. మతపరమైన సమస్యలను కమ్యూనిటీ హాల్ లాంటి వాటిల్లో పరిష్కరించుకుంటే సమయం, డబ్బు వృథా అవ్వకుండా ఉంటుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు వారీగా వారి వారి కమ్యూనిటీ హాలు నిర్మించుకొని అందులో తగు వివాదాలు పరిష్కరించే విధంగా పెద్దల సమక్షంలో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తదనుగుణంగా కేసుల సంఖ్య పెరగకుండా చిన్న చిన్న సమస్యలను వారి వారి వర్గాలు పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని.. ఏదైనా న్యాయ సహాయం కావాలంటే.. సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ సదస్సులో వివిధ వర్గాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



నవతెలంగాణ-కొండాపూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు విమర్శించారు. ఆ సంఘం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తోగర్‌పల్లి, అలియాబాద్, గారకుర్తి గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 15 రోజుల్లో ఇవ్వాల్సిన కూలి డబ్బులను.. 2 నెలలైనా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఎంపీల జీతాలు లక్ష నుంచి రూ.1,24,000 కు పెంచిన కేంద్ర ప్రభుత్వం, ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 ఎందుకు పెంచ డం లేదన్నారు. వెంటనే కూలి ధరలు పెంచాలన్నారు. అలాగే కూలీలకు సమ్మర్ అలవెన్స్, టెంట్లు, మెడికల్ కిట్లు, పనిముట్లు ప్రతికూలికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, చిన్నూ సాబ్,కృష్ణ తదితర కూలీలు పాల్గొన్నారు.

## జీపీపీ డిపోను సందర్శించిన రీజినల్ మేనేజర్

-ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డు
-మెదక్ రీజియన్ మేనేజర్ఎస్తేర్ ప్రభులత




నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

ఆర్టీసీ కార్మికులు శ్రమించి పనిచేస్తే ప్రభుత్వ ఆదాయం ఎంతో పెరుగుతుందని మెదక్ రీజియన్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత అన్నారు. శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో లోని ఎర్నింగ్స్, మెకానికల్, ఆఫీస్ విభాగాలో సమీక్షించమన్నారు. డిపో లో ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డ్స్ ప్రధానోత్సవం ఘనంగా చేసుకున్నామన్నారు. జీపీపీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ కేటగిరి కండక్టర్, డ్రైవర్లు, మెకానిక్ ల శ్రమను గుర్తించమన్నారు.వారికీ ప్రశంస పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్టీసీఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వేసవి కాలం వడ దెబ్బ నుంచి రక్షణ కోసం తగిన అవగాహనా సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. డిపోలో, బస్సు స్టేషన్ లో మజ్జిగ నీటి సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో దొరికే పండ్లు, పండ్లరసాలు తీసుకొని హైడ్రేటెడ్‌గా ఉండాలన్నారు. కండక్టర్స్ టిమ్ డ్రైవర్స్ మహిళా టికెట్ ఇష్యు సమయంలో ఒరిజినల్ ఐడి ప్రూఫ్ ఉంచుకోవాల న్నారు. పాసెంజర్ కంప్లీట్స్ రాకుండా చూసుకోవాలియని వారికి తెలిపారు.ఈ కార్యక్రమం లో డిపో మేనేజర్ పావన్ , అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ బాబు నాయక్ , ఎంఎఫ్ జమీల్, డిపో సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కోమటిబండలో అక్రమ మైనింగ్




- ఎలాంటి పర్మిషన్ లేకుండా మట్టి తవ్వకాలు
- వర్గల్ మండలం జబ్బాపూర్ ప్రైవేట్ కంపెనీకి మట్టి తరలిస్తున్నట్లు సమాచారం
- అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలని వేడుకుంటున్న ప్రజలు

ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి పర్మిషన్ లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతు న్నాయి ఎవరికి వారే యమునా తీరే అన్న విధంగా ప్రస్తుత పరిస్థితి ఏర్పడింది స్వలాభం కోసం పైసా ఖర్చు లేకుండా పని కానిస్తున్న అక్రమార్కులు ఈ తతంగమంతా గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామ సమీపంలో జరుగుతుంది. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇష్టారీతిన ప్రైవేట్ కంపెనీ నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నారు. స్వలాభం కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

కోమటిబండ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఫంక్షను హాల్ ప్రక్కన అక్రమంగా ఎటువంటి పరిమిషను లేకుండా మట్టి త్రవ్వకాలు జరుపుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అక్రమార్కుల ఆగడాలకు చెక్కు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న కోమటిబండ గ్రామ బీజేపీ నాయకులు గడ్డం నవీన్ వారిని ప్రశ్నించారు. మట్టి ఎక్కడికి తరలిస్తున్నారు మీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. నువ్వెవరు మమ్మల్ని ప్రశ్నించేది నువ్వెవరి మమ్మల్ని అడిగేది మా ఇష్టం ఉన్నట్లు చేసుకుంటామని సమాధానం ఇచ్చారన్నారు. నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో ఎక్కడ కంప్లైంట్ చేస్తావో చేసుకో అని బెదిరించారన్నారు. గ్రామ నాయకుడు గడ్డం నవీన్ మాట్లాడుతూ.. అక్రమంగా గ్రామంలో మట్టి తవ్వకాలు ఎవరి అండదండలతో జరుగుతున్నాయి, ఎందుకోసం జరుగుతున్నాయి అని ప్రశ్నించారు. కచ్చితంగా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నటువంటి అట్టి వ్యక్తుల పైన చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలన్నారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న టువంటి ప్రదేశము ఫంక్షన్ హాల్ పక్కనే ఉన్నది.ఆ ఫంక్షన్ హాల్ గ్రామానికి సంబంధించినది కాబట్టి అక్కడ మైనింగ్ జరిగిన ప్రదేశంలో ఎవరైనా పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలనిగ్రామస్తులు కోరుతున్నారు.

## రైతు రుణమాఫీ వెంటనే చేయాలి

- బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా.. కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీని వెంటనే చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి కలెక్టర్ క్రాంతి వల్లూరుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. పెట్టుబడి దారులకు లక్షల కోట్లు మాఫీ చేస్తున్న బ్యాంక్‌లు రైతులకు ఎందుకు మాఫీ చేయటం లేదని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులను ప్రభుత్వం విస్మరిస్తున్నదన్నారు. సంగారెడ్డి జిల్లాలో మంజీరా గ్రామీణ బ్యాంక్ పరిధిలో సుమారు 1000 మందికి పైగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కానీ ఇప్పటి వరకు బ్యాంక్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్నరు. కలెక్టర్ తక్షణమే చర్య తీసుకొని రైతులకు రుణమాఫీ ఇప్పించాలని కోరారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి,విష్ణువర్ధన్ గౌడ్, రామచంద్రయ్య, నాగరాజు,దినేష్ గౌడ్, పోశయ్య,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, విట్టల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కేతకీలో వైద్యారోగ్యశాఖ మంత్రి పూజలు

- ఆలయ పరిసర దుర్గంధంపై అసహనం



నవతెలంగాణ-ఝరాసంగం

జిల్లాలోనే పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని శనీ అమావాస్య సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సంహ శనివారం సందర్శించారు. అంతకు ముందు ఉదయం మండల పరిధిలోని దత్తగిరి ఆశ్రమాన్ని దర్శించుకుని ఆశ్రమంలో నిర్వహించిన శని మహాయజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని శనేశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాఘ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్.. మంత్రిని శాలువా పూలమాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కేతకీ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో వెలసిన శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ శివరుద్రప్ప శాలువా పూలమాలతో సన్మా నించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఆలయం ముందు గల వాలాద్రి పై నుంచి మంత్రి వెళ్తుండగా.. పరిసరాల దుర్గంధం రావడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇంత వాసన వెదజల్లుతుంటే ఎం చేస్తున్నారని స్థానిక నాయకులను ప్రశ్నించారు. ఆలయ పరిసరాలు బాగుచేయడానికి, ఆలయ అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలతో రావాలని స్థానిక నాయకులకు సూచించారు.



## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-జోగిపేట

మాదక ద్రవ్యాలు వద్దు.. జీవితమే ముద్దు... యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని తెలంగాణ యాంటీ నార్కటిక్ సోల్జర్స్ వ్యక్తిత్వ వికాస శిక్షకులు కొంక రాజేశ్వర్, దొబ్బల ఉదయ్ కుమార్‌లు తెలిపారు. అందోల్ ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట ఎస్సై పి.పాండు మాట్లాడుతూ.. 'డ్రగ్ రహిత తెలంగాణ కోసం మనమందరం కృషి చేయాలి' అని అన్నారు. ముఖ్యంగా టీనేజ్‌లోని విద్యార్థులు మాదకద్రవ్యాల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమాచారం తెలిస్తే 1098లికు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్పందన , టీచింగ్ అసోసియేట్స్ హర్షిత , సంహిత తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



### డిగ్రీ కళాశాలలో పోస్టర్ విడుదల..

జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి.రమేష్ ఆధ్వర్యంలోయాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి .రేష్మ దేవి, అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

- కార్మికుల జోలికొస్తే ఖబర్దార్
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్

నవతెలంగాణ-సంగారెడ్డి

మే 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశాన్ని కేవల్ కిషన్ భవన్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ చట్టాలను పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు చుట్టాలుగా మార్చిందన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి పెట్టుబడుదాలకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందన్నారు. కార్మిక వర్గం పోరాటం చేయడంతో ప్రస్తుతానికి ఆపిన ఈ చట్టాలను.. ఏప్రిల్ నుండి అమలు చేస్తామని అంటుందన్నారు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఏ చట్టం తెచ్చిన మోడీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వెంటనే ఈ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా మే 20న సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయన్నారు. సమ్మెలో ప్రతి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని.. మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. మల్లేశం, జి.సాయిలు, నాయకులు పాండురంగారెడ్డి, యాదగిరి, ప్రవీణ్, మహిపాల్, వరలక్ష్మి, సురేష్, నాగేశ్వరరావు, కొండల్ రెడ్డి, రమేష్, భీమ్ రెడ్డి, శోభ, గౌరమ్మ, యశోద, రాందాస్, గణేష్, నారాయణ, వివిధ యూనియన్ల కార్మికులు పాల్గొన్నారు.



## ఉద్యోగ విరమణ సహజమే..

- విధి నిర్వాహణలో చేసిన సేవలు ప్రజల గుండెల్లో నిలిచిపోతాయి
- సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు
- ఎస్ఐలు రాములు, ఖుర్షీద్ అలీ, ఎఆర్ ఎస్ఐ సంజీవయ్యలకు ఘన వీడ్కోలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమేనని.. కానీ విధి నిర్వాహణలో చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పలువురి సిబ్బంది వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గొల్ల రాములు.. 1983లో జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకం అయ్యారన్నారు. గడిచిన 42 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో సాధారణ విధులతో పాటు క్రైమ్ విధులను.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సైతం విధులు నిర్వహించా రన్నారు. తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచలంచెలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్ఇన్‌స్పెక్టర్‌గా స్థాయికి వచ్చారన్నారు. అలాగే సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఖుర్షీద్ అలీ.. 1989లో జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై గడిచిన 35 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో స్టేషన్ రైటర్‌గా, సాధారణ విధులను, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ విధులు నిర్వహించారన్నారు. విధులను సక్రమంగా నిర్వహిస్తూ.. సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారన్నారు. అదేవిధంగా ఎఆర్ ఎస్ఐసంజీవయ్య.. 1989లో జిల్లా పోలీసు శాఖలో ఎఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా నియామకమై గడిచిన 35 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో సాయుధ దళంలో సాధారణ విధులతో పాటు వివిపి పర్సనల్ సెక్యూరిటీ అధికారిగా, పోలీస్ ట్రెనింగ్ కాలేజ్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా, గ్రేహౌండ్స్‌ల, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహించారన్నారు. తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ.. అధికారుల మన్ననలు పొందాడన్నారు. సంజీవయ్య ఉత్తమ సేవలకుగాను రాష్ట్ర స్థాయిలో సేవా పతకాలను సైతం అందు కున్నాడన్నారు. సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ.. ఎఆర్ ఎస్ఐగా పదోన్నతి పొందారన్నారు. వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా మిగిలిన శేష జీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ తరపున అతనికి, అతని కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందింస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఎఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్ఐ రామరావు, రిటైర్డ్ అవుతున్న అధికారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు

-జిల్లాలో 8.90 లక్షల మందికి లబ్ధి
-పక్కదారి పడితే చర్యలు తప్పవు డీసీఎస్ఓ. తనుజ



నవతెలంగాణ-సిద్ధిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ మొదటి నుంచి ఉగాది కానుకగా రాష్ట్రంలోని ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల్లోకి ప్రజలకు సన్నబియ్యం అందించడానికి జిల్లా పౌరసరఫరాల అధికారులు సన్నబియ్యాన్ని తరలించారు. జిల్లాలో 2.91 లక్షల రేషన్ కార్డులలో 8,90,848 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ 56,94,000 మెట్రిక్ టన్నుల సన్నపు బియ్యం అవసరం కాగా రేషన్ షాపులకు జిల్లా అధికారులు తరలించారు. ఉగాది రోజున సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనుండగా, ప్రజలందరికీ ఏప్రిల్ ఒకటి నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా అందించనున్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మాదిరిగా ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ ని చేయనున్నారు.

### గత బియ్యాన్ని అలాగే నిల్వ...

మార్చి నెలలో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయగా, మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని అదే రేషన్ దుకాణాలలో నిలువ చేసి ఉంచాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చేంతవరకు రేషన్ షాప్‌లలో ఉన్న దొడ్డు బియ్యం అదేవిధంగా నిల్వ చేసి ఉంచనున్నారు.

### పక్కదారి పడితే చర్యలు తప్పవు

-తనూజ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు రేషన్ డీలర్లు అందించాలి. పక్కదారి పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. సన్న బియ్యం కాకుండా దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేయవద్దు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం లబ్ధిదారులందరికీ ఏప్రిల్ ఒకటి నుంచి సన్నబియాన్ని అందించాలి. రేషన్ షాపులకి అవసరమై నంత సన్నబియ్యాన్ని పంపించాము.

## జంక్షన్ పనులను పరిశీలించిన మంత్రి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పలు ప్రాంతాలను పరిశీలించారు. జంక్షన్‌ల సుందరీకరణ పనులపై ఆరా తీశారు. మహాత్మా గాంధీ చౌరస్తా జంక్షన్, హుస్నాబాద్ పట్టణంలో చేపల మార్కెట్‌ను ఆయన పరిలించారు. చేపలు అమ్మే మహిళలతో మంత్రి ప్రభాకర్ ముచ్చటించారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు.

### ముస్లింలకు కుట్టు మిషన్‌ల పంపిణీ

హుస్నాబాద్ పట్టణంలో ముస్లింలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ కుట్టు మిషన్లు కుటుంబ ఆర్థిక అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. ఎంతమందికైన కుట్టు మిషన్‌లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అందరికీ అందేలా చూడాలని ఆర్డీవో , మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50వేల నుంచి 4 లక్షల వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. నేను మీ శాసన సభ్యుడిని మీకు అండగా ఉంటానన్నారు. రంజాన్ నెల కాలంలో నెల రోజుల పాటు మీరంతా దీక్షలు చేశారని, అందరికీ అంత మంచి జరగాలని రంజన్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్, ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ రవీందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం.. ఏడుగురికి గాయాలు

### కుక్కల దాడిలో గాయపడిన బాధితులు



నవతెలంగాణ-సిద్ధిపేట అర్బన్

సిద్ధిపేట అర్బన్ మండలం పరిధిలోని బక్రిచెప్యాల గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలోని ఏడుగురిని గాయపర్చడంతో బాధితులను సిద్ధిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో చిన్నపిల్లలతో పాటు యువకులు, వృద్ధులు కూడా ఉన్నారు. గాయపడిన వారిలో అక్షయ్ కుమార్ (14), కావ్య (20), భరత్ (25), బాబు (62), ప్రసాద్ (40), లక్ష్మీ (55), కనకవ్వ (45)లు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు మొత్తం ఏడుమందిని గాయపర్చిందని తెలిపారు. కుక్కల భయంతో రోడ్డుపై పిల్లలు, వృద్ధులు తిరిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటి వ్యర్థాలు బయట పడవేయడంతో కుక్కల బెడద ఎక్కువైందన్నారు. కుక్కల బెడద చాలా ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## పండగలను శాంతియుతంగా జరపడం అభినందనీయం

**నవతెలంగాణ-జహీరాబాద్**




సర్వమతాల సారం ఒక్కటే అని.. అందరూ కలిసిమెలిసి పండుగలను జరపడం అభినందనీయమని ఆర్డీఓ రామ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వపరంగా స్థానిక ఏసియన్ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా సెట్విన్ చైర్మెన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందులను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, తాసిల్దార్ రమేష్, వివిధ శాఖల అధికారులు మాజీ మున్సిపల్ చైర్మెన్ మహంకాళి సుభాష్ గుప్తా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి ,నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



శరవేగంగా విస్తరిస్తున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయం నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన విధిదీపాలను ప్రారంభించారు. అనంతరం రూ.30 లక్షలతో సింపోనీ కాలనీనుంచి చిన్నవాగు వరకు చేపట్టనున్న పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములైనప్పుడే సార్ధకత చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మల్లేష్‌యాదవ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురికి పదేండ్ల జైలుశిక్ష

### లక్ష రూపాయల చొప్పున జరిమానా

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు పదేండ్లు జైలు శిక్ష, లక్ష రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్టు పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేష్ గౌడ్ తెలిపారు. 2019లో జహీరాబాద్‌కు చెందిన వీరుశెట్టి, ఝురా సంఘానికి చెందిన బన్సీలాల్, బీదర్‌కు చెందిన నీలారం మేత్రి లు దారకొండ నుంచి జహీరాబాద్‌కు ఎండు గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. దాంతో ఆ ముగ్గురికి 10 పదేండ్ల జైలు శిక్షతోపాటు, లక్ష చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.




## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**నవతెలంగాణ-జోగిపేట**

ప్రతి ఒక్కరూ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట కోర్టు న్యాయవాదులు వెంకటకృష్ణ, నర్సింలులు సూచించారు. అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామంలో జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి ఆదేశాల మేరకు లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, డ్రంక్ అండ్ డ్రైవ్, మెయింటెనెన్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు.

## శ్రీ విశ్వవసు నామ సంవత్సరంలో అంతా శుభమే జరగాలి

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



శ్రీ విశ్వవసు నామ సంవత్సరంలో పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజలందరికీ శుభం జరగాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభిలాషించారు. తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందోత్సాహాలతో పండుగను నిర్వహించుకోవాలని కోరారు.

## పంచాలింగేశ్వర్ ఆలయానికి కేదారినాథ్ పూజారి



**నవతెలంగాణ-మనూర్**

మండలంలోని బాధల్‌గావ్ గ్రామంలో గల పంచాలింగేశ్వర్ ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా జరిగిన వేడుకల్లో కేదారినాథ్ పూజారి శివలింగస్వామి శనివారం పాల్గొన్నారు. ప్రజలు భక్తి మార్గంలో నడుచుకోవాలని ఆయన ప్రవచనాలు బోధించారు. అంతకుముందు గ్రామస్థులు శివలింగస్వామికి ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. స్వామి మాస శివరాత్రి వేడుకలో పాల్గొనడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో లింగం పటేల్, శంకరప్ప, డా అంబ్రూత్, నర్సిములు, యదుగొండ వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.




## రేపు ఉదయం 8:30 గంటలకు ఈద్-ఉల్-ఫితర్

**నవతెలంగాణ-జహీరాబాద్**

నేటి సాయంత్రం చంద్రుడు కనిపిస్తే రేపు(సోమవారం) ఉదయం 8:30 గంటలకు ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ నిర్వహించనున్నట్టు ఈద్గా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ మాజీద్ తెలిపారు. ఈద్గా మైదానంలోఈద్గా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని మసీదుల యువకులు, నగరంలోని పండితులను ఆహ్వానించి.. ముఫ్తీ నజీర్ అహ్మద్ హసమీ, ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ఖాస్మీ ఖాజియుద్దీన్ ఖతీబ్‌ల సమక్షంలో చర్చలు జరిపి ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిపారు. కాబట్టి ముస్లింలందరూ నిర్ణీత సమయానికి ముందే సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## గీతం అధ్యాపకుడు ఆదిశేషయ్యకు లలిత కళల్లో పీహెచ్‌డీ



**నవతెలంగాణ-పటాన్‌చెరు**

గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్‌ఎస్)లోని కళలు, ప్రదర్శనా కళల విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆదిశేషయ్య సాడే లలిత కళల్లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్ డీ) పట్టా పొందారు. పంజాబ్, పగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ) దీనిని ప్రదానం చేసింది. జానపద మూలాంశాలు.. ఆంధ్రప్రదేశ్‌లో తోలుబొమ్మలాట కళారూపాల అభివ్యక్తి' అనే శీర్షికతో ఆయన చేసిన సంచలనాత్మక పరిశోధన, ఎల్ పీయూలోని లలిత కళల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వేశ్వరి తివారీ మార్గదర్శనంలో జరిగింది. తోలు బొమ్మల కళ గొప్ప వారసత్వం సాంస్కృతిక ప్రాముఖ్యతను అన్వేషించడానికి ఆదిశేషయ్య తన పరిశోధనను అంకితం చేశారు. ఈ సాంప్రదాయ కళను నిర్వచించే సంక్లిష్టమైన జానపద మూలాంశాలు, స్పష్టమైన కథ చెప్పే సంప్రదాయాలు, ప్రతీకాత్మక కళాత్మకతను ఆయన అధ్యయనం పరిశీలించి, దాని చారిత్రక ఔచిత్యం, కళాత్మక పరిణామంపై తాజా దృక్కోణాలను అందిస్తోంది. ఆదిశేషయ్య పీహెచ్‌డీ పట్టాను సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, జీఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ సన్నీ జోస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.




## కొండాపూర్‌లో చలివేంద్రం ఏర్పాటు

**నవతెలంగాణ-కొండాపూర్**

మండల కేంద్రంలో ప్రధానరోడ్డు పక్కన చలివేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్, ఉపతహసీల్దార్ మర్రి ప్రదీప్‌లు సంయుక్తంగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రం ఆయా గ్రామాలకు కేంద్ర బిందువు అని.. రోజూ వివిధ పనుల మీద చుట్టు పక్కల గ్రామాల వారు వస్తుంటారన్నారు. అయితే ప్రస్తుత వేసవి తాపంలో అలాంటి వారి దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ పంచాయతి సెక్రటరీ ఓం ప్రకాష్, కొండాపూర్ తాజా మాజీ సర్పంచ్ రుక్మద్దీన్, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# ముస్తాబైన మసీదులు ఈద్గాలు

**నవతెలంగాణ-జహీరాబాద్**

ముస్లిం మైనార్టీ సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ పండుగ కోసం మసీదులు, ఈద్గాలను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. నెలరోజుల కఠిన ఉపవాస దీక్షలు ముగిసిన రోజు ఈద్-ఉల్-ఫితర్ పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగ రోజు మైనార్టీ సహోదరులు చిన్నపెద్దా తేడా లేకుండా అందరూ కలిసి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్ధన ఈద్-ఉల్-ఫితర్ నిర్వహిస్తారు. నెలరోజుల ఉపవాస దీక్షలు.. ఈ రోజు ప్రత్యేక ప్రార్ధనల ద్వారా ఏడాదిపాటు చేసిన తెలియని తప్పులకు ఉపశమనం లభిస్తుందని వారి నమ్మకం.

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, పటాన్చెరు, సదాశివ్పేట్, సంగారెడ్డి, జోగిపేట, నారాయణఖేడ్ శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో పండగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుంది. ఇప్పటికే ఎస్పీ పట్టణ ప్రాంతాల్లో పండగకు ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోస్టులను సైతం ఏర్పాటు చేశారు. అన్ని వర్గాల వారికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టారు. రాత్రి వేళల్లో స్వయంగా ఎస్పీనే గస్తీలు నిర్వహించి ఆయా వర్గాల వారితో చర్చించి వారి సమస్యలను తెలుసుకొని ఎక్కడికి అక్కడ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. దాంతో అన్ని వర్గాల ప్రజల్లో కూడా ఆనంద వ్యక్తం అవుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వపరంగా ప్రతి శాసనసభ నియోజకవర్గ కేంద్రంలో ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం కూడా వివిధ శాఖలో విధులు నిర్వహిస్తున్న ముస్లిం మైనారిటీలకు సాయంత్రం పనివేళల్లో మినాయింపు ఇచ్చిన విషయం కూడా విధితమే.

**ఈద్-ఉల్-ఫితర్ అనంతరం మిఠాయిల పంపిణీ..**

ఈద్-ఉల్-ఫితర్ పండగ ఆనందం కుల మతాలకు అతీతంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపు కుంటూ మిఠాయిలను పంపిణీ చేసుకుంటారు. రంజాన్ పండుగ జరుపుకుంటున్న ముస్లిం సహోదరులకు ఇతర వర్గాలకు చెందిన వారు శుభాకాంక్షలు తెలపగా.. ముస్లిం సహోదరులు వారి ఇండ్లకు మిఠాయిలు పంపించి శుభాకాంక్షలు తెలియజేస్తారు.

**ఈద్గాల వద్దకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు..**

ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు ముగిసిన వెంటనే ఈద్గా వద్దకు వెళ్లి వివిధ పార్టీల నాయకులు ప్రజలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీ. అక్కడ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తారు.



## విషం చిమ్మే డంపింగ్‌యార్డ్ మాకొద్దు

**నవతెలంగాణ-గుమ్మడిదల**

పచ్చని పల్లెల్లో విషం చిమ్మే డంపింగ్‌యార్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఏర్పాటు చేయొద్దంటూ మండల కేంద్రంతోపాటు నల్లవెల్లి, ప్యారానగర్ గ్రామాల్లో నిరవధిక నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దీక్షలు శనివారం నాటికి 53వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మండల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇక్కడ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేస్తే.. గాలి, నీరు కలుషితమై ప్రజా జీవనానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. వన్యప్రాణుల మనుగడే లేకుండా అవుతుందన్నారు. ఏండ్ల నుంచి వ్యవసాయంపై ఆధారపడిన తమకు అన్యాయం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పచ్చని పల్లెల్లో ఇలాంటి కాలుష్య కుంపటి పెట్టొద్దని.. వెంటనే ఈ డంపింగ్‌యార్డ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే అంతవరకు మండల జేఏసీ, జిల్లా ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలు కొనసాగిస్తామని హెచ్చరించారు.



## సహకార సంఘం సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ-రామచంద్రాపురం**

తెల్లాపూర్ వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం వెలిమెల రైతు వేదికలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ 2025-26కి గాను రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తామన్నారు. విజయవంట నూనె సొసైటీ ద్వారా తక్కువ ధరకు అందిస్తామన్నారు.కాగా సుమారు 80మందిరైతులకు రూ. 40,65,287 లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. వ్యవసాయ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ.. పంట సాగు మెలకువలు గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు రాజ్ కుమార్, మోహన్ రెడ్డి, సునీల్, లచ్చ వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్చాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
- కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

**నవతెలంగాణ-సంగారెడ్డి**



మన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, బడిబాట కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సహకరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పరంగా కల్పిస్తున్న సౌక ర్యాలను వివరించారు. కలెక్టరేట్లోని సమావేశమందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, పాల్గొని జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరును సమీక్షించారు. సామాజిక న్యాయం అండ్ హక్కుల పరిరక్షణ, వెనుకబడిన తరగతుల, గిరిజన మరియు దళిత వర్గాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (ఎస్సీ/ఎస్టి, పిఒ ఏ యాక్ట్ ) అమలు మరియు కేసుల పరిశీలన. కులవృత్తుల అభివృద్ధి, ఆర్థిక సహాయ పథకాల పురోగతి. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు తీసు కుంటున్న చర్యలు.. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల నిర్వహ ణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ , వెనుకబడిన తరగతుల, గిరిజన , దళిత వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన వసతుల కల్పన కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పరంగా కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఉపాధి కల్పనలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ అమలు. స్టైఫండ్, ఉపకార వేతనాల పంపిణీ, అమలులో సాంకేతిక సమస్యలు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన భూముల రక్షణ.. అక్రమ ఆక్రమణలను అరికట్టి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యతపై సమీక్ష. అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల ఆరోగ్య సంరక్షణ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలు.. బాధితులకు ప్రభుత్వ పరంగా సాయం, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల స్వీకరణ, విచా రణలో పారదర్శకత, బాధితులకు న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరెడ్డి, జిల్లా సాంఘికసంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లావెనుకబడినతరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఆర్డీఓలు, డీస్పీలు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## పార్టీ తరపున రూ.2లక్షల ప్రమాద బీమా అందజేత



**నవతెలంగాణ-సంగారెడ్డి**

కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన ఎల్లారం ముత్తయ్య ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ తరపున రెండు లక్షల ప్రమాద బీమా చెక్కును సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా.. పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రెండు లక్షల సాయాన్ని బీఆర్ఎస్ అందిస్తున్నదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేలా రూపొందించారన్నారు. కేసీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు బాధిత కుటుంబా సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మ్యాకం విటల్, పీఏసీఎస్ చైర్మెన్ రాజు, కార్యదర్శి గోవర్దన్ రెడ్డి, అనంతసాగర్ మాజీ సర్పంచ్ ఇంద్రారెడ్డి , మాజీ ఉపసర్పంచ్ రఘునాథ్ రెడ్డి, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎండి జలీల్, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, ఎర్రోళ్ల చిన్న, తదితరులున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



పటాన్ చెరు పారిశ్రామికవాడలో గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో డీఎస్పీ రవీందర్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీలకు వెళ్లే సాయిబాబా గుడి, సాకి చెరువు కట్ట వద్ద గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసుల నిఘా పెంచి గంజాయి విక్రయిస్తున్న వారి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతినగర్, శ్రీనగర్ కాలనీలకు వెళ్లే 40 ఫీట్ల సీసీరోడ్డులో సాయిబాబా టెంపుల్ వద్ద ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటల నుండి రాత్రి 12 గంటల వరకు 15 నుంచి 20 మంది యువకులు గంటల తరబడి కార్లు, ఆటోల్లో ఉంటున్నారన్నారు. దాంతో అటు వైపు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. కాగా ఈ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నట్లుగా అనుమానాలు ఉన్నాయన్నారు. సాకి చెరువు కట్టపై రాత్రి వేళల్లో కార్లు పార్కింగ్ చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, దారి పొడవునా వచ్చి వెళ్లేవారు, తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారన్నారు. ముత్తంగి రింగ్ రోడ్డు నుండి పోచారం నుండి ఇంద్రేశం, రామేశ్వరం బండ వెళ్లే సర్వీస్ రోడ్డులో, ముత్తంగి నుండి కర్దనూర్ వెళ్లే సర్వీస్ రోడ్డు, మరియు రుద్రారం ప్యాలెస్ హోటల్ పక్కన మెయిన్ రోడ్డు పైన అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాత్రి వేళల్లో మహిళలు, ప్రజలు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారన్నారు. అప్పటికైనా ఆయా ప్రాంతాల్లో పోలీసుల గస్తీలను పెంచి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు కే రాజయ్య పి.పాండురంగారెడ్డి, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**



విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల గ్లోరియస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీకౌన్సిలర్ వి. చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ప్రతీఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం విశ్వాసాన్ని నింపుతాయన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం తల్లిదండ్రుల తోడ్పాటు ఉంటే అద్భుత ఫలితాలను సాధిస్తారన్నారు. చదువుతో పాటు ఆటపాటలు కూడా చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా ముఖ్యఅతిథులను, నాయకులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాల కోసం పోరాడుదాం

- పూలే, అంబేద్కర్ జయంతులను ఘనంగా నిర్వహిద్దాం
- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్

**నవతెలంగాణ-సదాశివపేట**

మహనీయుల ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సదాశివపేట మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 11న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న ఉన్నాయని.. ఈ జయంతులను ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన బాటలో పయనిస్తూ కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. అలాగే చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలన్నారు. అనంతరం మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి.మల్లేశం, కార్యదర్శిగా ఎం. ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా మోహన్, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా మహిపాల్, నాగరాజ్, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్, విజయ్, దావీదు, సంతోష్, రాజ్ కుమార్, రాజేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం నాయకులు ప్రభుదాస్, మోహన్, దిలీప్, పవన్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంతోష్ విజయ్, జైపాల్, బాలరాజ్, మనోజ్, అరవింద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయండి




- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను

నవతెలంగాణ-సిద్ధిపేట

ఏప్రిల్ 25 నుంచి 27 వరకు ఖమ్మం నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదవ మహాసభలను విద్యార్థులు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను కోరారు. శనివారం పట్టణంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, రాష్ట్ర యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు నుండి 1000 మంది విద్యార్థి ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన అతిథులు, పలు రాష్ట్రాల నుండి విద్యార్థి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 5వ రాష్ట్ర మహాసభలు 3 రోజుల పాటు ఖమ్మం నగరంలో జరుగుతున్నాయని, జిల్లా నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి భరత్ కుమార్, జిల్లా నాయకులు విక్రమ్, అజయ్, సునీల్, నవదీప్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

-జిల్లా కలెక్టర్ ఎం. మన చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాజీవ్ యువ వికాసం" స్వయం ఉపాధి పథకాలకు సిద్దిపేట జిల్లాలోని ఎస్సీ, ఎస్టి, మైనారిటీ, బీసీ, ఈబిసి, ఈడబ్ల్యూఎస్, కార్పొరేషన్ల, ఫెడరేషన్ లకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. శనివారం ఎస్సీ కార్పొరేషన్ వారు రూపొందించిన రాజీవ్ యువ వికాసం పోస్టర్లను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఈడీఎస్సీ కార్పొరేషన్ రామాచారితో కలిసి ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అనంతరం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఏవీఎస్ నాగరాజు శర్మ పదివి విరమణ కార్యక్రమం



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

డీపీఆర్ఓ సిద్దిపేట కార్యాలయంలో ఏవీఎస్( ఆడియో విజువల్ సూపర్వైజర్)గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న నాగరాజు శర్మ పదవి విరమణ శనివారం కార్యక్రమం కలెక్టరేట్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏవీఎస్ నాగరాజు శర్మను డీపీఆర్ఓ, సమాచార ఇంజనీరింగ్ కార్యాలయ అధికారులు సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ రవికుమార్ మాట్లాడుతూ.. నాగరాజు శర్మ సమాచార పౌర సంబంధాల శాఖలో దాదాపు 32 సంవత్సరాలు పబ్లిసిటీ అసిస్టెంట్‌గా, ఆడియో విజువల్స్ సూపర్వైజర్ గా విశేష సేవలు అందించి జిల్లా కలెక్టర్ల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం వరకు ఫోటోగ్రాఫర్‌గా సేవలందించి మెప్పు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ భూపాల్ రెడ్డి, రిటైర్డ్ డిపిఆర్ఓ శాంతి కుమార్, సమాచార శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి

-ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి

నవతెలంగాణ-ములుగు



రైతులకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల వరి పొలాలు నీరు లేక పూర్తిగా ఎండిపోతున్నాయి, రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, కొండపోచమ్మ సాగర్ కాల్వ ద్వారా రైతులకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని, అది విడిచిపెట్టి రైతులపై కేసులు కట్టడం సరైనది కాదని అన్నారు.

## అనాధ పిల్లలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-తొగుట



తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడంతో నలుగురు పిల్లలు అనాధలుగా మారడం దురదృష్టకరమని మండల జనసేన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కొద్ది రోజుల క్రితం మండలంలోని ఎల్లా రెడ్డి పేట గ్రామానికి కెమ్మసారం భాగ్య నాగరాజు ఆత్మహత్య చేసుకోవడంతో నలుగురు పిల్లలు అనాధ లు అయ్యారు. ఈ సందర్భంగా మండల జనసేన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసి యేషన్ సభ్యులు పిల్లను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు వరం లాంటిది 'రాజీవ్ యువ వికాసం'

నవతెలంగాణ-మర్కుక్




రాజీవ్ యువ వికాసం పథకం గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఓ వరం లాంటిదని కాంగ్రెస్ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి ,యూత్ కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు బైరగౌని శ్యాంప్రసాద్ గౌడ్‌లు వేరు వేరుగా శనివారం పత్రిక ప్రకటలో పేర్కొన్నారు. యువ వికాసం పథకానికి అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో ఈ పథకాన్ని తీసుకురావడం హర్షణీయమని అన్నారు. అర్హులైన వారందరూ వచ్చేనెల ఏప్రిల్ 5 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

-పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాని యాదగిరి గజ్వేల్లో మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు అన్నారు. కొత్తదనని పునరుత్తేజాన్ని తనతో తీసుకొచ్చేది ఉగాది అని, కొత్త సంవత్సరానికి నాంది పలుకుతుందని ఈ సంవత్సరం అందరి జీవితాల్లో అమితమైన సంతోషాలతో వెలుగులతో నింపాలని తీపి చేదు కలిసిందే జీవితమని, కష్టం సుఖం తెలిసిందే జీవితమని ఆ జీవితాల్లో ఆనందోత్సవాలను పూయించేందుకు వస్తుంది ఉగాది పర్వదినమని తెలిపారు.

## ఎండిపోతున్న వరి పంటకు ట్యాంకర్లతో నీరు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం కాశగుడిసెలు గ్రామానికి చెందిన రైతు కమల్ తనకు ఉన్న మొత్తం 8 ఎకరాల వ్యవసాయ భూమి. అందులో ప్రతి ఏటా ఆరు ఎకరాల వరి పంటను పండిస్తాడు. ఈ యాసంగిలో నాలుగు ఎకరాలు వరి పెట్టినట్లు తెలిపారు. అయినప్పటికీ భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీరు లేక గత వారం రోజులుగా ప్రతి రోజు ఎండిపోతున్న రెండు ఎకరాల వరి పంటకు ప్రక్క గ్రామం ఆకునూరు నుంచి ఆరు ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి నీటిని పోస్తున్నట్లు తెలిపారు. ఒక ట్యాంకర్ నీటికి సుమారు రూ.1500 లు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యుత్ షాక్ తగిలి గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్ మండల మండలం పరిధిలోని ధర్మారం గ్రామంలో గడ్డివాము దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన మండల కనకయ్య పశుగ్రాసాన్ని సమకూర్చి పెట్టుకున్నారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడి ఉండడంతో అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగిలి మంటలు అంటుకున్నట్లు తెలిపారు. పశుగ్రాసం అగ్నికి ఆహుతి కావడంతో రైతు ఆందోళనకు గురయ్యారు.

## దివ్యాంగులకు వెయ్యి కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించిన నిధులలో దివ్యాంగుల అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు కేటాయించాలని దివ్యాంగుల జేఏసీ గౌరవ అధ్యక్షులు దండు శంకర్, జిల్లా అధ్యక్షులు చిట్టెల సంపత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. వివిధ కులాల కార్పొరేషన్లకు కేటాయించిన మాదిరిగా, దివ్యాంగులకు రూ. వెయ్య కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బొంగోని శ్రీశైలం గౌడ్, కేమ్మసారం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం దళారులకు చెక్ పడేనా..?

- రీసైక్లింగ్ చేసి విక్రయించుకుంటున్న వైనం..!
- రైస్ మిల్లులకు భారీగా తరలింపు..
- ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్

రేషన్ షాపులో పేదలకు ఇస్తున్న దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నాయి. వీటిని అరికట్టేం దుకు ప్రభుత్వం కార్యచరణ ప్రా రంభించింది. దళారులకు చెక్ పె ట్టేందుకు పేదలకు సన్న బియ్యం ఇస్తే సరిపోతుందని భావించిన ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని భావిస్తోంది. దొడ్డు బియ్యం రేషన్ షాప్‌లో నుంచి తీసుకుపోతున్న పేదలు అక్కడి నుంచి దళారులు ఇంటి వద్దకు వచ్చి వాటిని తీసుకొని గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిం చుకుంటున్నారు. మరికొందరు రైస్ మిల్లులో విక్రయిస్తే వాటిని రీసైకిలింగు చేసి సన్న బియ్యంగా మారు స్తున్నారు. వీటిని రైస్ మిల్ యజమానులు క్వింటల్ రూ.6 వేల చొప్పున ఇతరులకు విక్రయిస్తున్నారు. అధికారుల అండదండతో రైస్ మిల్లలో పలుకుబడితో రేషన్ బియ్యం రీసైకిలింగ్ చేసి సన్న బి య్యంగా మారుస్తున్నారని, రీసైకి లింగ్ దందా జోరుగా సాగుతు న్నదని సమాచారం. గజ్వేల్ ప్రాం తంలో ఉన్న అనేక రైస్ మిల్లులు చీకటి దందలు నడుపుతున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో కొన్ని పత్తి దుకాణాల పేరిట బోర్డులు ఏర్పాటు చేసుకొని రేషన్ బియ్యం అక్రమ దందాలు చేస్తున్నారు. ఇప్పటికి అనేకసార్లు దాడులు జరిగిన నిర్వాహకులు దందా నడపడం ఆగడం లేదు. పట్టుబడుతున్నప్పటికీ పేరుకు కేసులు నమోదు చేసి వదిలి వేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో రోజు ఏదో ఒక చోట రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టుకొని కేసులు వేస్తున్నారు. అయినా ఈ దందాలు ఆగడం లేదు. దీంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి సన్నాహాలు చేస్తుంది.

### జిల్లాకు 16.082 మెట్రిక్ టన్నులు

సన్న బియ్యం పంపిణీ ప్రభుత్వం పేదలకు ఇచ్చేందుకు సిద్ధమవుతుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో భోజనానికి సన్నబియాన్నే వాడుతున్నారు. పేదలకు అదే స్థాయిలో ఇవ్వాలని భావించిన ప్రభుత్వం సన్న బియ్యం ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు. సిద్దిపేట జిల్లాకు 16.082 మెట్రిక్ టన్నుల తన ధాన్యం కేటాయించారు. విద్యార్థులకు



3.611 టన్నుల మధ్యాహ్న భోజనానికి వాడుతున్నారు. పేదలకు 12.471 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు.

### కొత్త కార్డులతో అదనపు భారం

సిద్దిపేట జిల్లాలో కొత్త రేషన్ కార్డులతో బియ్యం కోట పేద కుటుంబాలకు పెరుగనున్నది. పాత కార్డులో ఇంటిలో కుటుంబ సభ్యులు పెరిగితే వారి పేర్లను కొందరిని నమోదు చేసుకున్నారు. అదనంగా సుమారు 12 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. సన్న బియ్యం పంపిణీ చేస్తే రేషన్ షాపుల ద్వారా ఇప్పటివరకు పేదలకు అందుతున్న దొడ్డిబియ్యం మాదిరిగా పక్కదారి పట్టదని ప్రభుత్వం భావిస్తోంది.

## ప్రాథమిక పాఠశాలలకు ప్రీ ప్రయిమరీ నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-సిద్ధిపేట



ప్రతి ప్రాథమిక పాం శాలకు ప్రీ ప్రయిమరీ నిధులు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్ శర్మ ప్రభుత్వ విద్యాశాఖ అధికారులను కోరారు. శనివారం డీఈఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాన్ని అం దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సులభంగా చేరాలంటే ఒకటో తరగతి నుంచి నాణ్యమైన విద్య అందాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య ఉండాలన్నారు. జిల్లాలో ఇటీవల కొన్ని ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే ప్రీ ప్రయిమరీ గ్రాంట్ మంజూరి కావించబడిందని, సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రయిమరీ సెక్షన్ ఉండేవిధంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏప్రిల్ వరకు నిధులు కేటాయించి, మంజూరు చేయాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక ఆర్థిక సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యద ర్శులుగా నూతనంగా ఎన్నికైన ఆరెళ్ల వీర మల్ల య్య, తాటికొండ ప్రణీ త్‌లను శనివారం సీపీఐ (ఎం) నాయకులు వారి కార్యాలయాలలో కలిసి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతు.. చేర్యాల ప్రాంత ప్రజలకు, బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అభినందనలు తెలిపిన వారిలో సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ళబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బద్దిపడిగె కృష్ణారెడ్డి, ఆలేటి యాదగిరి, దాసరి ప్రశాంత్, చేర్యాల, కొమురవెల్లి మండలాల కార్యదర్శులు బండకింది అరుణ్ కుమార్, తాడూరు రవీందర్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజు తదితరులు ఉన్నారు.



## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-చేర్యాల



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని బాలాజీ సినిమా టాకీస్ చౌరస్తాలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గు రాజు పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు రాజు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదని అన్నారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ బిసి బడుగు బలహీన వర్గాలకు ఒంటినిండా బట్టలు ఇవ్వడమే కాకుండా ప్రతి మధ్యతరగతి కుటుంబ ానికి కూడా చదువు అందుబాటులో ఉండాలని ప్రతి గ్రామం,మండలం లో ప్రైమరీ, హై స్కూల్ లతోపాటు జూనియర్ కళాశాల, ప్రతి ఊరికి రవాణా సౌకర్యం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్జీవం పోసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి నారాయణరెడ్డి, పాము శివలింగం, మధు, బిక్షపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపిన సీపీఐ బృందం

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హుస్నాబాద్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందు తుందని ధీమా వ్యక్తం చేస్తూ శనివారం సీపీఐ బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రి కార్యాలయం కలిసి పుష్పగుచ్చం అందించి అభినంద నలు తెలిపారు.. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు హర్షనీయమన్నారు. గతంలో కంటే ఇప్పుడు మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కి అనేక అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. మంత్రి హయాంలో హుస్నాబాద్ నియోజకవర్గమును రాష్ట్ర స్థాయిలో అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో ఉంచుతారని నమ్మకం ఉందని అన్నారు అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పలు సమస్యల పైన వినతి పత్రం అందజేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ నాయకులు యెడల వనేశ్, కొమ్ముల భాస్కర్, జేరిపోతుల జనార్ధన్, ముంజ గోపి,సుదర్శన చారి,మంద శ్రీనివాస్, హరిఫ్,పిల్లి రజిని,బోనగిరి శంకర్, ఎల్లయ్య విజయ్, ఎంకన్న, తదితరులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచుదాం

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ), ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ అసోసియేషన్ (జీజే సీపీఏ) ల బాధ్యులు పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇటీవల నియామకమైన నూతన అధ్యాపకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీజేసీపీఏ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డిలు మాట్లాడారు. ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని విద్యానందించాలని సూచించారు. రాబోవు విద్యా సంవత్సరానికి కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన అధ్యాపకులను శాలువాతో సన్మానించి, పెన్నులను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి తో పాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అంటే ప్రాణం

- ప్రజల మధ్యనే మల్లారెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్ : కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రాణం. నిరంతరం ప్రజలు, కార్యకర్తల మధ్యనే గజ్వేల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మెన్ మద్దూరు మల్లారెడ్డి ఉంటున్నారు. గత 25 ఏండ్లుగా కాం గ్రెస్ బలోపేతం కోసం ఎంతో కృషి చేస్తున్నారు. గజ్వేల్ మం డలం బయ్యారం గ్రామానికి చెందిన మద్దూరు మల్లారెడ్డి మొదటి కాంగ్రెస్ వాదిగా ఉంటూ గ్రామంలో ప్రజ లు, కార్య కర్తల మధ్య ఉంటూ వారి యోగక్షేమాలను చూస్తుంటారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తా: మల్లారెడ్డి రైతు సంక్షమానికి వంతు కృషి చేస్తా అని మద్దూరి మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడు తూ.. ఇటీవల చైర్మెన్గా బాధ్యతలు చేప ట్టిన సందర్భంగా వ్యవసాయ రైతులకు కావలసిన సూచనలు సలహాలు అధికారుల ద్వారా అందిస్తామన్నారు. రైతులకు కావలసిన ఇన్ని సౌకర్యాలను సమకూర్చమన్నారు. గజ్వేల్, కొండపాక, రాయపోల్ మండలాల్లో రైతులకు కావలసిన సౌకర్యా లను అందుబాటు ఉంచుతామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

## సిద్దిపేట ఫౌండేషన్ సేవలు అభినందనియం

-మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ పురస్క రించుకొని పట్టణ మిలాన్ గార్డెన్‌లో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో పేద ముస్లిం ప్రజలకు రంజాన్ కిట్లును మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజ నర్సు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా సిద్దిపేట ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమో ఘమని అన్నారు. ఇరవై సంవత్సరాలుగా పేద ముస్లింలకు రంజాన్, బక్రీద్ పండగలకు తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్ సద్ది నాగరాజు రెడ్డి ,కో-అప్షన్ సభ్యు లు సయ్యద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మచ్చ వేణు గోపాల్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు షమీమ్, లయిక్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రదాత పొన్నం.!

- చిత్రపటానికి పాలాభిషేకం..!
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలయ్య.!

నవతెలంగాణ-అక్కన్నపేట

ఉద్యమాల వీరుడు పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ప్రాంతంలో పోటీ చేసి గెలుపొందడం ఈ నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య అన్నారు. శనివారం రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి కాం గ్రెస్ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. అక్కన్నపేట మండల పరిష త్ అభివృద్ధి కార్యాలయ నిర్మాణానికి రూ : 1.5 కోట్లు మం జూరు చేయడం హర్షనీయమన్నారు. రెండు రోజుల క్రితం శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల హుస్నా బాద్ ఆయన చొరవతోనే వచ్చిందన్నారు. గిరిజన ప్రాం తమైన అక్కన్నపేటకు ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్కు మంజూరు చేశారని ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుం డా మండలంలోని ప్రతి గ్రామానికి జిమ్ సెంటర్లు మం జూరు చేశారన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అభివృద్ధి పనులు చేస్తూ అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్య క్రమం లో అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరె డ్డి, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, గంపల శ్రీనివాస్, అక్కన్నపేట యూత్ అధ్యక్షులు పాంద్రాల దాము, తదితరలు పాల్గొన్నారు.



## మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ తండ్రి మృతి పట్ల పలువురు సంతాపం

-అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-నంగునూరు



రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి తండ్రి ఎడ్ల మల్లారెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఎడ్ల సోమిరెడ్డి స్వగ్రామమైన మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో అతని తండ్రి అంత్యక్రియల్లో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని సంతానం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవెర్గు రాజనర్సు, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు వంగ నాగిరెడ్డి, సుడా మాజీ చైర్మెన్ పాల సాయిరాం, తదితరులు పరామర్శించి అతని తండ్రి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యుల మధ్య బంధుమిత్రుల రోదనలతో అంతిమ వీడ్కోలు యాత్రను చేపట్టారు.

## మాదకద్రవ్యాల నిరోధక పోస్టర్ ఆవిష్కరించిన డీఎస్పీ

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో సిద్దిపేట మెదక్ సంగారెడ్డి వికారాబాద్ జిల్లా ఇంచార్జి డీఎస్పీ పుష్పన్ కుమార్, సీఐ రామానాయక్‌ల చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కమిటీ రాష్ట్రంలోని కళాశాల అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సందీప్ శాండిల్య, సీతారాంలు యువత ఈ రోజుల్లో డ్రగ్స్‌కి ఏవిధంగా బానిసలు అవుతున్నారో, అడిక్షన్ తీవ్రత ఎంతగా ఉందో, దానికి గల కారణాలు, వాటిని నివారించడానికి గల మార్గాల గురించి వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. వారి ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ వి.బాలకిషన్, సభ్యులుగా జి. బాలకిషన్, బి కృష్ణయ్యలను నియమిం చడంతో పాటు, కళాశాల విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.పి అయోధ్య రెడ్డి, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డా.మధుసూదన్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ సెలవుల్లో కూడా ఆస్తి, నల్లా బిల్లులు చెల్లించవచ్చు

నవతెలంగాణ-సిద్దిపేట

ఆస్తి పన్నులు, నల్లా బిల్లుల చెల్లించుటకు ఉగాది పండగ, రంజాన్ పండుగ సెలవు దినముల్లో కూడా సంబంధిత బిల్ కలెక్టర్లకు, మున్సిపల్ కార్యాలయం నందు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పండుగ సమయంలో కూడా మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఆస్తి పన్ను, నల్ల బిల్లులు ప్రజలు చెల్లించాలని కోరారు.

నవతెలంగాణ-చేర్యాల

ఉగాది, రంజాన్ సందర్భంగా నేడు, రేపు సెలవులు ఉన్నప్పటికీ ఆస్థి పన్నులు, నల్లా బిల్లుల చెల్లింపు కోసం చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ప్రజలు ఆస్థి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు, నల్ల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి చేర్యాల పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ప్రజా సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలి

బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కొచ్చి 15 నెలలు దాటుతున్నగా ప్రజాసంక్షేమం మరిచిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలో అమలు పథకాలు అనేకం ఉన్న వాటిని అమలు చేయాలని కోరారు. తులం బంగారం, లక్ష రూపాయల నగదు, మహిళలకు రూ.2500 లు, యువత భరోసా, పింఛన్ రూ. 4000 వేల అమలు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరి స్తున్న ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు.

## అంబేద్కర్‌ను అవమానపరిచిన దుండగులను శిక్షించాలి

- కేపీఎస్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-మిరుదొడ్డి



అంబేద్కర్‌ను అవమాన పరిచిన దుండగులను వెంటనే శిక్షించాలని కేవీపీఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల ఇన్చార్జి బక్కి తోటయ్య, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఎల్లంలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని చేతును విరగొట్టడం సిగ్గుచేటని అన్నారు. మహనీయుల విగ్రహాలపై దాడులు చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ ఉష్కే కుమారస్వామి, రైతు కార్మిక సంఘం నాయకులు వేణు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బక్కి పరశురాములు, లింగంపేట ఎల్లంపాల్గొన్నారు.

## సమాజంలో ఎలాంటి అసమానతలు ఉండొద్దు

నవతెలంగాణ-శివ్వంపేట



సమాజములో ప్రతి ఒక్కరు కూడ సమానమేనని, ఆధునిక యుగమిది సమాజంలో ఎవరిపట్ల కూడ అసమానతలను పాటించొద్దని తహసీల్దార్ కమలాద్రి, ఎస్ఐ మధుకర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలతో శనివారం మండలంలోని లింగోజీగూడ గ్రామంలోని పౌర హక్కుల దినోత్సవాన్ని మండల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కమలాద్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని మతాలు, కులాలు సమానమేనని ఎవరిని కూడ కించపరచడం, అవమానించడం చేయడం మంచి పద్ధతి కాదని, హైటెక్ యుగంలో మనమున్నామని అందరిని సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్ఐ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఏదైనా ఒక కులాన్ని గాని, మతాన్ని గాని ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గిర్ధవర్ కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుండ్రెడ్డిపల్లిలో రూ 9 వేలు పలికిన ఇసుక వేలం

తూప్రాన్ తహశీల్దార్ ఎస్. విజయలక్ష్మి

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మండలంలోని గుండ్రెడ్డి పల్లి గ్రామంలో తహశీల్దార్ ఎస్. విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఇసుక వేలం పాట నిర్వహించారు. ఈ ఇసుక వేలంపాట డిప్యూ టీ తహశీల్దార్ ప్రభుదాస్ సమక్షంలో చేపట్టగా రామ స్వామి, నవీన్ అనే ఇద్దరు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారు.అనంతరం నవీన్ అనే వ్యక్తి రూ 9 వేలకు ఇసుక వేలం పాట పాడి ఇసుకను దక్కించుకున్నారు.

## ఎమ్మెల్సీ కవితకు కాళ్లకల్లో ఘన స్వాగతం

- బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మనోహరాబాద్



నిజామాబాద్ పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితకు జిల్లా ప్రారంభంలోని కాళ్లకల్లో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బంగారమ్మ దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్ రేఖల హేమలత శేఖర్ గౌడ్, నాచారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, మాజీ సర్పంచ్ నాగభూషణం, మాజీ ఉపసర్పంచ్ నూకల వెంకటేష్ యాదవ్, యూత్ నాయకులు రాహుల్ రెడ్డి, పార్టీ మండల ఇన్చార్జి అధ్యక్షులు కార్ రతన్ లాల్, బండి నరేందర్ గౌడ్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నాపూర్‌లో మాజీ జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-శివ్వంపేట



మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో ఇటీవలే కరెంట్ షాక్‌తో మృతి చెందిన సింగిరెడ్డి, సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని జిల్లా పరిషత్ ఆర్థిక, ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శనివారం పరామర్శించారు.ద అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఒక నెలకు సరిపడే నిత్యావసర సరుకులను కూడ అందించి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ప్రమాదంలో మరణించడం బాధాకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతి బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాంచంద్రం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, యుద్ధంరెడ్డి, కొమురయ్య, హనుమంతరెడ్డి, సతీష్ యాదవ్, బుచ్చిరెడ్డి, బోల్ల ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గ వైన్ షాప్ లో చోరీ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలంలోని వడియారం గ్రామ శివారులో ఉన్న శ్రీ కనకదుర్గ మద్యం షాపులో గుర్తుతెలి యని దుండగులు షట్టర్‌ను తొలగించి, అందులో ఉన్న సిసి కెమెరాలను ధ్వంసం చేసి, చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి వైన్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారాన్ని అందించారు. స్థానిక పోలీసులు అక్కడి చేరుకొని విచారణ చేపట్టారు. మద్యం షాపులో సుమారు రూ.50 వేలు నగదు, మద్యం సీసాలు ఎత్తుకెళ్లినట్టు పోలీసుల విచారణలో తేలింది. వైన్ షాపు యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కూచిపూడి నృత్యంలో శివానికి నంది అవార్డు

నవతెలంగాణ-పాపన్నపేట



మెగా హెల్పింగ్ ఫౌండేషన్ అధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హైద్రాబాద్‌లో జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో మెదక్ నృత్య టీచర్ శివానికి నంది అవార్డు లభించింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మెదక్ పట్టణానికి చెందిన నటరాజ కళారోరణం టీచర్‌తో పాటు వైష్ణవి విద్యార్థులు విన్నయి, లక్ష్మి సహస్ర, నివారిక, విద్యశ్రీ, మేదశ్రీశాన్వి, వైశాలి, వైష్ణవి శానీ, భమశ్రీలను కన్సోటీషన్ బహుమతులు అందజేశారు.

## పోరాడి ఓడిన చిన్నారి రిత్విక

- బోరున విలపిస్తున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణానికి చెందిన కాయితి లక్ష్మణ్,సుగుణ దంపతుల కుమార్తె కాయితి రిత్విక (3) చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించింది. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నది. చిన్నారి రిత్విక చికిత్సకు రూ 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులకు వైద్యులు చెప్పారు. పేద కుటుంబమైన తల్లిదండ్రులు తమ స్తోమతకు తగ్గట్లుగా డబ్బులు ఆసుపత్రిలో చెల్లించి చికిత్స అందించారు. అయినా కూడా న్యూమోనియా లంచ్ ఇన్ఫెక్షన్ నయం కాకపోవడంతో శనివారం చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారి రిత్విక మృతితో వారి కుటుంబంలో, తూప్రాన్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారి మృతి పై పట్టణ వాసులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 2న హలో బీసీ చలో ఢిల్లీ

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్ గౌడ్

నవతెలంగాణ-తూప్రాన్



ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించే హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మెదక్ బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ మెదక్ జిల్లా కన్వీనర్, తెలంగాణ గౌడ కల్లు గీత వృత్తి దారుల సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు చిన్నలింగ్ మల్లిఖార్జున్ గౌడ్ పిలుపునిచ్చారు. హలో బీసీ ఛలో ఢిల్లీ ఏప్రిల్ 2వ తేదిన ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బిసి ల పోరు గర్జన కార్యక్రమంలో బిసిలు భారీ ఎత్తున తరలి రావాలని బీసీల పోరు గర్జన విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- ప్రిన్సిపల్ రామకృష్ణారావు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాలలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పూర్తి అయిన సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యు యేషన్ డే వేడుకలు విద్య ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారావు, డీన్ అశోక్, ప్రైమరీ ఇన్ చార్జ్ కళావతి, ప్రీప్రైమరీ ఇన్చార్జ్ ఉష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ భాగంగా విద్యార్థులు ఉపన్యాసం, నాటిక, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి జోన్ ఏజిఎం బి.వి రమణ రావు, ఆర్ ఐ చక్రి, అకడమిక్ కోఆర్డినేటర్ రవి, ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు.

## సీఎంఆర్ చెక్కును అందించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



ఓపెన్ మున్సిపాలిటీలోని పోతరాజు పల్లికి చెందిన బొల్లె బోయిన సునీల్ యాదవ్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, తూప్రాన్ తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణలు అందజేశారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా విడుదలయ్యే చెక్కుల ద్వారా బాధిత పేద నిరుపేద ఆపదలో ఉన్న కుటుంబాలకు ఒక వరంలాగా ఉపయోగపడుతుందన్నారు. ఇంకా ఎవరైనా ఆపదలో ఉండి, ఆసుపత్రిలో ఉన్న బాధితులు ఎవరైనా ఉంటే సీఎంఆర్ఎఫ్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లెర్ల రవీంద్ర గుప్తా, మాజీ కౌన్సిలర్లు జిన్నా భగవాన్ రెడ్డి, బాణాపురం రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజుగౌడ్, దామోదర్ రెడ్డి, పాల్గొన్నారు.

# 24 గంటలు రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-కౌడిపల్లి



24 గంటలు ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల్లో రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికతగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ వైద్యాన్ని పేదలకు అతి చేరువలోకి తెస్తూ, పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏరియా ఆసుపత్రిలోని ఆత్యావసర చికిత్స విభాగం ఇన్ పేషంట్ వార్డ్, ఔషధాలను నిలువ ఉంచిన డ్రగ్ స్టోర్ తదితర విభాగాలను పరిశీలించారని మెదక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరు రాత్రి వేళలో కూడా ఆదర్శంగా ఉందని వైద్యాధికారులు సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటూ విధులను క్రమశిక్షణగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, అలాగే రోగులతో మాట్లాడి వారికి రాత్రి వేళలో అందుతున్న సదుపాయాలు వారి ఆరోగ్యం గురించి ఆరా తీసినట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో రాత్రి పుట అందుబాటులో ఉన్న వైదులు, సేవలను పరిశీలిస్తుండగా సుమారు 2:00 గంటల సమయంలో 108 వాహనంలో ఆవంచ గ్రామానికి చెందిన మహిళా పురిటి నొప్పులతో రావడం జరిగిందని, అట్టి మహిళకు ఆసుపత్రి వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి సాదారణ కాన్పు చేసి తల్లి బిడ్డలను సురక్షితంగా వుంచడం హర్షణీయమని కొనియాడారు.

అదే విధంగా సుమారు ఉదయం 5 గంటల ప్రాంతంలో కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆ సమయంలో కూడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం చూసి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే మెదక్ జిల్లా వైద్య సేవలలో మొదటి స్థానంలో నిలబెట్టడానికి వైద్యశాఖలోని అన్నీ విభాగాలు కృషి చేస్తున్నాదని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్యాధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్య రక్షకులు

- ఎస్ క్లబ్ సేవలు అభినందనీయం
- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్






సైనికులు దేశం కోసం సేవ చేస్తే పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారని తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఉదయం తూప్రాన్ మున్సిపల్ సిబ్బందికి ఉగాది పర్వదిన సందర్భంగా ఉత్తమ సేవా పురస్కార అవార్డ్‌లు ఇవ్వడం గర్వించదగిన విషయమన్నారు. వారి సేవలను గుర్తించి ఉగాది పురస్కార అవార్డ్ ప్రధానోత్సవము చేయడంలో తూప్రాన్ ప్రెస్ క్లబ్ సేవలు అభినందనీయమని ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి కొనియాడారు. పట్టణాల్లో, పల్లెల్లో వీధులు శుభ్రంగా ఉండడానికి కారణం కేవలం పారిశుధ్య కార్మికులు మాత్రమేనన్నారు. అలాంటి వారికి ఎంత చేసినా తక్కువేనన్నారు. ప్రతి పారిశుధ్య కార్మికునికి స్టీల్ వాటర్ బాటిల్‌ను తన వంతుగా ఉచితంగా అందజేస్తానన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి మాట్లాడుతూ విధినిర్వహణలో పారిశుధ్య కార్మికులు పడుతున్న పాట్లు కృషి అభినందనీయమని ప్రతి పనికి ముందుండి సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. తూప్రాన్ ప్రెస్ క్లబ్ నాయకులు వార్తల సేకరణలో ఎంతో బిజీగా ఉన్నా ఇంత మంచి కార్యక్రమానికి ఆర్గనైజ్ చేసి పారిశుధ్య కార్మికుల సేవలు గుర్తించి చిరకాలం నిలిచే సర్టిఫికెట్ అందజేయడం వారి పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు మండుటెండలో సైతం నిలిచి ప్రజలకోసం అహర్నిశలు చేస్తున్న కృషి అభినందనీయమని వారి సేవలను శ్లాఘించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంఠాయపాలెం వేణుగోపాల్, భాస్కర్ గౌడ్‌లు ఒకరోజు ముందు వారి ధృడ సంకల్పంతో ముందుకు వచ్చి అమలు చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారు డాక్టర్ జానకిరామ్, సీనియర్ జర్నలిస్ట్ లు ఆర్.శివశంకర్ గౌడ్, పి.ఆంజనేయులు గౌడ్, పి.నగేష్ గుప్త, ఎస్.సందీప్ కుమార్, వి.శివ కృష్ణ గౌడ్, బాలసాయి హరిప్రసాద్,సర్గల స్వామి, జయపాల్ రాథోడ్, మచ్చ యాదగిరి, భూషణం చారి, కోవూరు శ్రీనివాస్ గుప్త లు పాల్గొనగా కార్యక్రమానికి అన్ని తానై నడిపించిన సీనియర్ జర్నలిస్ట్ కడిమే మోజెస్ తోపాటు మున్సిపల్ మేనేజర్ ఏ.రఘువరన్, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీకి వస్తువులను బహుకరించిన ఐటీసీ సంస్థ

నవతెలంగాణ-మనోహరాబాద్



మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐటీసీ సంస్థ పలు వస్తువులను బహుకరించారు. ఐటిసి సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆసుపత్రికి వచ్చే పేషంట్ల సౌకర్యం కోసం వాటర్ ప్యూరి ఫైర్‌తోపాటు బిపి ఆపరేటర్లను, ప్రసూతి శాలలో ఏసీ, రెండు చిన్న రిఫ్రిజిరేటర్లు, అగ్ని ప్రమాదం నుంచి రక్షణ కోసం ఫైర్ సిలిండర్, రెండు టేబుల్స్, పిల్లర్ స్టాండ్, హైజినిక్ ట్రాలీని అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సిబ్బంది ఐటీసీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుండ్లపల్లిలో పీఏసీఎస్ చైర్మెన్ ఆర్థికసాయం

నవతెలంగాణ-శివ్వంపేట



మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన విభూది ఎల్లయ్య అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని పీఏసీఎస్ చైర్మెన్ చింతల వెంకట్రాంరెడ్డి శనివారం పరామర్శించి, వారికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి బాధిత కుటుంబానికి తప్పకుండా సహాయం అందజేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎల్కంటి వినోద్ కుమార్, వంచ సత్యనారాయణ రెడ్డి, బజారి నర్సారెడ్డి, మల్లారెడ్డి, దివాకర్ రెడ్డి, ఎరుకలి బాలయ్య, బౌల సత్తయ్య, బాలకృష్ణ గౌడ్, మొయినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పాడుబడ్డ బావులను సందర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఎస్సీ కాలనీలోని మూడు పాడు బడిన బావులు ఉన్నాయని అవి ప్రమాదకరంగా ఉండి ప్రాణాప్రాయం జరిగే అవకాశం ఉందని దరఖాస్తు చేయడంతో దరఖాస్తుకు స్పందించిన స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి శనివారం నస్కల్ గ్రామంలోని ప్రమాదకరమైన బావులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన బావులను సంబంధిత యజమానులకు నోటీసులిచ్చి పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటామని లేని పక్షంలో ఉపాధి హామీ పథకం కింద బావులు పూడ్చే పనులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా బావులను పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, నరసింహారెడ్డి, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, బైండ్ల రాజు, పంగ కుమార్, మహేష్, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తై బజార్ వేలం వాయిదా

- బుధవారానికి వాయిదా వేసిన కార్యదర్శి.

నవతెలంగాణ-మనోహరాబాద్

తై బజార్ వేలంలో నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి ప్రియాంక పేర్కొన్నారు. శనివారం మండలంలోని పారిశ్రామిక ప్రాంత మైన మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్‌లో 2025-26 సంవత్సరానికిగాను తైబజార్ బహిరంగ వేలంపాటను ఎంపీడీవో కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ హాజరు కాగా వేలంపాటలో చీర్ల ఇంద్రసేనా, మైలారం నరసింహ, చీర్ల యాదగిరిలు పాల్గొన్నారు. ఇందులో మైలారం నరసింహ రూ.4,21,200లు పాడగా, చీర్ల ఇంద్రసేన రూ.4,21,700లు వేలంపాటను పాడారు. దాంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలంపాటను వాయిదా వేస్తున్నట్టు కార్యదర్శి ప్రియాంక తెలిపారు. గతం లో 2022లో రూ.9,25 వేలకు తై బజార్‌ను దక్కిం చుకున్నారు. అనంతరం 2023-24 సంవత్సరానికిగాను నిర్వహించగా నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేశారు. దాంతో అప్పటి కార్యదర్శి నిర్ణయించిన ధర రావడం లేదంటూ ధరను తగ్గించాలని డీపీఓకు లెటర్‌ను పెట్టారు. అప్పటి నుంచి డీపీఓ అనుమతి రాకపోవడంతో అదే ధర ప్రకారం వేలంపాటను నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా తై బజార్ వేలంను నిర్వహించినప్పటికీ నిర్ణయించిన ధర రాలేదు. దాంతో కార్యదర్శి ప్రియాంక వేలంపాటను వాయి దా వేస్తున్నట్టు, తిరిగి బుధవారం వేలంపాటను నిర్వ హించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రాజు యాదవ్, మాజీ వార్డు సభ్యులు వెంకటేశం గుప్తా, అచ్చ గొని ప్రభాకర్ గౌడ్, నాయకులు ప్రభాకర్ గౌడ్, వెంకట్రాంరెడ్డిలతోపాటు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సామాజిక అసమానతలు

- చూపితే చర్యలు తప్పవు
- తహసీల్దార్ తులసి రామ్

నవతెలంగాణ-టేక్మాల్



ప్రజలలో సామాజిక అసమానతలు చూపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తులసీరామ్ అన్నారు. శనివారం హసన్ మహమ్మద్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులనుదేశించి ఆయన మాట్లాడారు. సమాజంలో అందరూ సమానమేనని పెద్ద, చిన్న తేడా లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుని పైన ఉందని చెప్పారు. ప్రజలందరూ అసమానతలు రూపుమాపేందుకు సిద్ధపడాలన్నారు. సామాజిక అసమానత అనేది ఒక రోగం లాంటిదని అది మనుషులను ఎదగకుండా చేస్తుందని, మానసికంగా కృంగదీస్తుందన్నారు. దానిని తరిమికొట్టే బాధ్యత ప్రతి యువకుడి పైన ఉందన్నారు. ప్రతి కుటుంబంలో ప్రతి వ్యక్తి చదువుకొని రాజ్యాంగాన్ని అర్థం చేసుకుంటే రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులపై అవగాహన వస్తుందన్నారు. చదువుకోకుంటే మూఢనమ్మకాలు నమ్ముతారని మూఢ నమ్మకాల వల్ల మనిషి ఎదుగుదల ఆగిపోతుందన్నారు. సాటి మనుషుల పట్ల మానవతా దృక్పథాన్ని కలిగి ఉంటే సామాజిక స్పృహ వస్తుందన్నారు. తద్వారా ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదుగ వచ్చని చెప్పారు. ఎస్సై రాజేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సమానమని చెప్పడానికి ఈ సమావేశం చక్కటి ఉదాహరణ అన్నారు. బాగా చదువుకొని మంచి స్థాయిలో ఉద్యోగాలు సంపాదిస్తే అసమానతలను రూపుమాపవచ్చని చెప్పారు. సామాజికంగా వెనుకబడిన తరగతులకు గుడులలో ప్రవేశం కల్పించకపోవడం వేరే మతాల వైపు ప్రజలు వెళ్లడం వంటివి జరుగుతున్నాయని చెప్పారు. అందరూ సమానమనే భావన కలిగిన నాడే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయి శ్రీకాంత్ గ్రామస్తులు ఉన్నారు.

## రిపోర్టర్ గడ్డం ప్రశాంత్‌ను పరామర్శించిన జర్నలిస్టులు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్ గడ్డం ప్రశాంత్ కుమార్ ఇటీవల హనుమాన్ మాల వేసుకున్న రోజే భోజనం చేస్తూ ఫిట్స్ వచ్చి వెనుకకు పడిపోయాడు. దీంతో రెండు కాలర్ బోన్స్ విరిగిపోయి స్పృహ కోల్పోగా హుటాహుటిన 108 అంబులెన్స్ వాహనంలో మొదటగా తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహ మేరకు కొంపల్లి లోని సాయి సిద్దార్థ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించి నాణ్యమైన చికిత్స అందించారు. రెండు కాళ్ళ బోన్స్‌కి శస్త్రచికిత్స చేశారు. కాగా శుక్రవారం మెదక్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుడ్డ భాగ్యరాజు, సీనియర్ జర్నలిస్టులు ఆర్.శివశంకర్ గౌడ్, లయన్ జానకిరామ్ గౌడ్, గైనిబైటి భాస్కర్ గౌడ్, ఎస్.వెంకటేష్ లు పరామార్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సాయి సిద్ధార్థ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడారు. గడ్డం ప్రశాంత్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పక్కా ప్రణాళికతో పన్నులు వసూలు చేయాలి

- సిడిఎంఏ స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వరరావు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రాపర్టీ టాక్స్, ఇతర నాన్ టాక్స్ టాక్సెస్ కలెక్షన్లపై రివ్యూ చేయుటకు సి డి ఎం ఏ రాష్ట్ర కార్యాలయం నుంచి స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వరరావు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరం మార్చి 2026 ముగిసే వరకు రూ.10 లక్షలను వసూలు చేసే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సీడీఎంఏ కార్యాలయం స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర రావు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డితో పాటు మున్సిపాలిటీ అధికారులకు వార్డు ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరమునకు ప్రాపర్టీ టాక్స్ మరియు ఇతర నాన్ టాక్సెస్ కలెక్షన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్షన్ పర్సంటేజ్ ని మెరుగుపరచుకోవడానికి మున్సిపల్ అధికారులు, సిబ్బందికి, తగు సూచనలు చేశారు జి ఎస్ డి పి లో తూప్రాన్ పురపాలక సంఘం టార్గెట్ ని అచీవ్ అయినందున కమిషనర్ గణేష్ రెడ్డి ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎ.రఘువరన్, వార్డు ఆఫీసర్లు, పాల్గొన్నారు.

## శాస్త్రుల వెంకటేశ్వర శర్మకు నేడు ఉగాది పురస్కారం





నవతెలంగాణ-శివ్వంపేట

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే "ఉగాది" పురస్కారాలకు మెదక్ జిల్లా శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఎంపికయ్యారు. ఉగాది పురస్కారాలలో భాగంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది ఉత్తమ పురస్కారాలలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉగాది రోజున ఆదివారం ఉత్తమ అవార్డును అందించడం జరుగుతుంది. పండితుల సత్కారాలు, ఆధ్యాత్మిక సేవలలో పలు ఉత్తమ సేవలను అందించినందుకు అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర ఎంపిక కావడంతో అమ్మవారి భక్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

### భక్తులతో కిటకిటలాడిన బగలాముఖీ శక్తిపీఠం

దేశంలోనే అత్యంత శక్తిపీఠాలలోనే ఒకటైన శివ్వంపేట బగలాముఖీ శక్తిపీఠం శనివారం అమావాస్య పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారికి మహాపూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి విశేషమైన పసుపుతో హరిద్రార్చన నిర్వహించి, రుద్రాయామల, శ్రీసూక్త, దేవి సూక్త, బగలా అష్టోత్తర నామార్చనలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి, వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం బగలాముఖీ శక్తిపీఠం ప్రాంగణంలో అమ్మవారికి మహామంత్ర హవనము అత్యంత వైభవంగా నిర్వహించారు. అమావాస్య పర్వదినం కావడంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల నుంచి వచ్చిన అమ్మవారి భక్తులతో బగలాముఖీ శక్తిపీఠం అమ్మవారి నామస్మరణతో మార్మోగిపోయింది.

### అమ్మవారి భక్తులకు అన్నదానం

అమావాస్య పర్వదినం సందర్భంగా శనివారం అమ్మవారి దర్శనభాగ్యం కోసం విచ్చేసిన భక్తులందరికి దర్పల్లి పాఠశాల ఎచ్ఎం వడ్డేపల్లి శ్రీనివాసరావు, నీల దంపతుల కుమార్తె వడ్డేపల్లి మానసలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి

- తపస్ మెదక్ జిల్లా శాఖ

నవతెలంగాణ-చేగుంట



భావి, భారత పౌరులను తయారు చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని కొంతమంది ప్రజా ప్రతినిధులు అనేక రకాలుగా అవమానపరుస్తూ విమర్శిస్తున్నారని తపస్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జడ్జి ఎల్లం, చల్లా లక్ష్మణ్ అన్నారు. చేగుంట తపస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినాయింపు ఇవ్వాలని, ప్రభుత్వం అనేక పనులకు ఉపాధ్యాయులను వినియోగించుకోవడం ద్వారా, ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన బోధన చేయలేకపోతున్నారన్నారు. వేసవి సెలవులు అనేవి విద్యార్థుల మానసిక స్థితి. ఆరోగ్యం రక్షణకు ఆధారంగా ఎప్పుడో నిర్ణయించబడిన పని దినాలని, అవి ఇప్పుడు కొత్తగా వచ్చినవి కాదన్నారు. ఉపాధ్యాయులు ఉదయం ఏ సమయానికి వెళ్లి సాయంత్రం ఏ సమయం వరకు పాఠశాలల్లో పని చేస్తున్నారో అందరికి తెలుసని, ఉపాధ్యాయులు సెలవులలో స్పాట్ కేంద్రాలలో మండే ఎండలో పరీక్ష పేపర్లు కరెక్షన్ చేస్తారని, ఎండ కాలంలో సప్లిమెంటరీ పరీక్షల విధులకు హాజరవుతారని, జూన్ మొదటి వారం నుంచే బడిబాటను నిర్వహిస్తారన్నారు. బడిలో ఉండే అనేక సమస్యలతో పోటీపడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, పేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు వారి వంతు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇవన్నీ తెలిసి కూడా ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఈ విధంగా అవమానించడం సరికాదని, ఇతర ఉద్యోగులకు ఇచ్చినట్లు ఉపాధ్యాయులకు 30 రోజులు ఎర్నింగ్ లీవ్స్ ఇవ్వడం లేదని, ఉపాధ్యాయులు తమ జీవితాంతం పనిచేసిన ఒక కారు కొనుక్కోవడం, ఒక ఇల్లు కట్టుకోవడం తప్ప ఇంకా ఏమి కూడ బెట్టిన సందర్భాలు లేవన్నారు. అన్ని తెలిసి కూడా ఈ విధంగా ప్రభుత్వ పెద్దలు ఉపాధ్యాయులను విమర్శించడం సరికాదన్నారు. సమాజంలో ప్రతివృత్తిలోకి వెళ్లెవారు తరగతిలో ఒకప్పటి విద్యార్థులు. వారిని తీర్చిదిద్దినది ఉపాధ్యాయులు అనే విషయాన్నిమరిచి పోవడం దురదృష్టకరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల బాధ్యులు మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, సిద్దు, సత్యనారాయణ, స్వామి, నరేందర్ రెడ్డి, సతీష్, పాల్గొన్నారు.

## అంగన్వాడీలో రంజాన్ వేడుకలు

**నవతెలంగాణ-కొండాపూర్**



మండల పరిధిలోని హరిదాస్పూర్ అంగన్వాడీలో రంజాన్ శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ ప్రాముఖ్యతను పేరెంట్స్‌కు పిల్లలు తెలిపారు. సేమియా స్వీట్ చేసి పిల్లలు వారి తల్లిదండ్రులు తినిపించుకున్నారు. ఈసీసీఈ డే (పూర్వ ప్రాథమిక దినోత్సవం)లో పిల్లలు నేర్చుకున్నవి పేరెంట్స్ ముందు చేసి చూపించారు.కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్శ్యామల పాల్గొన్నారు.



## యువకుడు అదృశ్యం

**నవతెలంగాణ-జహీరాబాద్**

నమాజ్ కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ హమీద్ ఈనెల 27న సాయంత్రం నమాజ్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతసేపు అయినా తిరిగి ఇంటికి రాలేదు. దాంతో అతడు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వాళ్ల దగ్గర వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో హమీద్ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**నవతెలంగాణ-కోహిర్**



మండలంలోని కొత్తురుడి గ్రామ శివారులో ఓ డీసీఎం డ్రైవర్ తప్పిదం వల్ల ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు ఎస్సై సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరుడి గ్రామ శివారులో జాతీయ రహదారి 65వ నెంబరు గ్లోబల్ గ్రీన్ పరిశ్రమ నుంచి ఓ డీసీఎం రాంగ్‌రూట్‌లో సదాశివపేట వైపునకు వెళుతున్నది. ఈ క్రమంలో రమేష్(50), మంగలి ప్రశాంత్(46)ను డీసీఎం ఢీకొట్టడంతో.. వారిద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడగా జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ రమేష్ మోహన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



**నవతెలంగాణ-జిన్నారం**

మండల పరిధిలోని సోలక్‌పల్లిలో అతినారం లక్ష్మమ్మ, నారాయణ గౌడ్‌ల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిన్నారం సీఐ నయీమోద్దీన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమానికి ముందుకు వచ్చిన సదరు కుటుంబ సభ్యులను ప్రశంసించారు. వేసవిలో దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ , నాయకులు పరమేశ్వర్ రెడ్డి, వర్నాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు,జగన్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, రమేష్ గౌడ్ పెంటేష్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు నరేష్ గౌడ్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## చెన్న బసవేశ్వర్ జాతరకు సర్వం సిద్ధం

**నవతెలంగాణ-మనూర్**



నాగలిగిద్దా మండలంలోని మావినెల్లి గ్రామంలో ప్రతి ఏటా ఉగాది పండగకు చెన్న బసవేశ్వర్ దేవాలయం జాతర జరుగుతుంది. అందులో భాగంగా నేడు జరగనున్న జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్ణాటక రాష్ట్రం భాల్కి సంస్థానం నుంచి మహారాజ్ ఆధ్వర్యంలో జాతర మహోత్సవం మూడ్రోజుల పాటు ఘనంగా జరగుతుంది. ఈ జాతరలో రోజు వారీగా భక్తి ప్రవచనాలు, నాటక ప్రదర్శన మరియు కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఈ జాతరకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణంలో దైవదర్శనం కోసం భారీకేడ్లు ఏర్పాటు చేశారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



## 'రాజీవ్ యువ వికాస్'ను సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-కొండాపూర్**

మండలంలోని యువతీ, యువకులు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ జి.నర్సింలు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ఈ పథకం కింద ప్రభుత్వం అన్ని వర్గాల వారికి రూ.4 లక్షల వరకు రుణాలను అందిస్తుందన్నారు. అందులో 60 నుంచి 80శాతం వరకు సబ్సీడీని కూడా ఇస్తుందన్నారు. కాబట్టి అర్హులైన యువతీ, యువకులు ఏప్రిల్ 5 లోపు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఘనంగా కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు




**నవతెలంగాణ-సంగారెడ్డి**

పట్టణంలోని స్థానిక శాంతినగర్, సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ హై స్కూల్‌లో కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ వేడుక ఎంతో ఉత్సాహంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి లీడ్ స్కూల్ సీనియర్ అకడమిక్ అడ్వైజర్ వరలక్ష్మి, సెయింట్ ఆంథోనీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, సెయింట్ ఆంథోనీ హై స్కూల్ ప్రిన్సిపల్ అండ్ అకడమిక్ డైరెక్టర్ ఈ. అరుణ రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ ఎల్. ప్రదీప్, ప్రీ-ప్రైమరీ అకడమిక్ కోఆర్డినేటర్ కాంతవల్లి ము ఖ్య అతిథులుగా హాజర య్యారు. దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారం భించారు. ప్రిన్సిపాల్ ఈ. అరుణ రెడ్డి సమావేశాన్ని ఉద్దేశించి, చిన్నారులకు అభి ందనలు తెలియజేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం తల్లిదండ్రులు అందించిన నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక, బోధనా బోధనే తర సిబ్బంది శ్రమ, కృషిని కొనియాడారు. లీడ్ స్కూల్ సీనియర్ అకడమిక్ అడ్వైజర్ వరలక్ష్మి, ప్రీ-ప్రైమరీ కోర్సుపై ప్రాముఖ్యతను వివరించి.. చిన్నారులు హెూలిస్టిక్ డెవలప్మెంట్ (సమగ్ర అభివృద్ధి) కోసంచురుకుగా నేర్చుకునే విధానం గురించి తెలిపారు. సెయింట్ ఆంథోనీ పాఠశాల ఉపాధ్యాయులు జాతీయ స్థాయి లో గుర్తింపు పురస్కారాలు సాధించడంలో చేసిన అసా ధారణ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ ఈ. విజయ్‌రెడ్డి చిన్నారులకు అభినందనలు తెలియ జేశారు.తమ ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది, తల్లి దండ్రులకు కృతజ్ఞతలు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో సాంకేతికత, మౌలిక వసతు లు మరింత మెరుగుపరిచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తల్లిదండ్రుల సహకారం పాఠశాల భవిష్యత్ విజయాల్లో ముఖ్యమైన భాగమన్నారు. సీని యర్ కిండర్‌గార్టెన్ విద్యార్థులకు గ్రాడ్యు యేషన్ సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి కలిగిన ప్రత్యేకమైన లక్షణాలను గుర్తించి ప్రకటించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేతఈ. సొలోమోన్ రెడ్డి దివ్య ఆశీస్సులతో కొనసాగింది.ఈ వేడు కలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిద ండ్రులు, తాతయ్య-అమ్మమ్మలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## గ్లోరియస్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం




**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేది ఉపాధ్యాయులేనని గ్లోరియస్ పాఠశాల కరెస్పాండంట్ సింహాచలం అన్నారు. బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న గ్లోరియస్ పాఠశాలలో శుక్రవారం రాత్రి 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సందేశంత్మకంగా నిర్వహించిన పలు కళారోపకాలు ప్రదర్శన అందరి దృష్టిని అకర్శించాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ అనిల్ కుమార్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణా రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు వి. ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సింహాచలం మరియు ప్రిన్సిపాల్ పబిత్ర కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరెస్పాండంట్ లు కొత్వాల్ హరికృష్ణ రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, ప్రభుకుమార్, కరుణసాగర్ రెడ్డి, శ్రీనివాస్, లోకానాదం,రాంబాబు,శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల ప్రతినిధులు మహిపాల్ రెడ్డి, హరిప్రియ, అబకస్ ట్రైనర్ స్నేహ, పాఠశాల ఉపాధ్యాయిలు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# నీళ్లులేక.. ఎండుతున్న వరి

- 4 గ్రామాల్లో 200 ఎకరాల వరకు దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**నవతెలంగాణ-జోగిపేట**



సింగూర్ కెనాల్ కాలువ కింద గల కొండారెడ్డిపల్లి, లక్ష్మిసాగర్, ఇటిక్యాల్, ముదిమాణిక్యం గ్రామాల్లో 400 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. అయితే సింగూరు కెనాల్ కాలువ నుంచి నీరు విడవకపోవడంతో దాదాపుగా 200 ఎకరాల వరిపంట ఎండిపోయింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కెనాల్ కాలువ మరమ్మతులు చేపట్టడంతో నీళ్ల వదలడం లేదని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సింగూరు సింగూర్ ప్రాజెక్ట్‌లో 22 టీఎంసీల నీరు ఉన్నట్టు సమాచారం. కెనాల్ మరమ్మతుల విషయం తమకు ముందుగానే చెప్పి ఉంటే.. వరి నాట్లు వేసే వాళ్ళమే కాదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని.. పంట ఎండిపోవడం చూడలేక కొత్తగా బోర్లు వేస్తే నీళ్ల పడకపోగా మరింత నష్టాల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నీళు వదిలి ఉన్న పంటను కాపాడాలని.. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

## పటాన్‌చెరు మండలానికి మరో ఆర్ఐని నియమించాలి

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



ప్రభుత్వ యంత్రాంగంలో రెవెన్యూశాఖ అత్యంత కీలకమైనదని.. అటువంటి శాఖలో సిబ్బంది కొరతవల్ల సమయానికి పనులు కాకపోవడం వల్ల దరఖాస్తుదారులు కాళ్లు అరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టెలికాం బోర్డు మెంబర్, బిజెపిజిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ ఆరోపించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం అనేకమంది ప్రజలు ఇక్కడికి వచ్చి నివసిస్తుంటారన్నారు. జిల్లాలో ఏ మండలంలోనైనా రెవెన్యూ కార్యాలయంలో ఇద్దరు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ)లు ఉంటారన్నారు. పటాన్‌చెరు పెద్ద మండలంతో పాటు పారిశ్రామిక ప్రాంతం కావటం వల్ల రోజువారిగా పలు సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారన్నారు. ఒక ఏడాది క్రితం వరకు ఇద్దరు ఆర్ఐలు ఉండేవారని.. బదిలీపై ఒకరు వెళ్లడంతో అప్పటి నుంచి ఒక ఆర్ఐ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. దాంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. వాపోయారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు రోజువారీగా కార్యాలయానికి వస్తూ.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేనికోసమైనా దరఖాస్తు చేసుకుంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి పటాన్‌చెరు మండలానికి మరొక ఆర్ఐని నియమించాలని డిమాండ్ చేశారు.



## బర్దిపూర్ ఆశ్రమంలో పులి మామిడి రాజు పూజలు

**నవతెలంగాణ-సదాశివపేట**

బర్దిపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి శ్రీ అవధూతగిరి మహారాజ్ పీఠాధిపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ శనేశ్వర శని త్రయోదశి.. అలాగే తన కుమార్తె జన్మదినం సందర్భంగా శ్రీ దత్తగిరి ఆశ్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి రాజు శనివారం సందర్శించారు. శనేశ్వర స్వామికి ప్రత్యేక తైలాభిషేకం, అర్చన కార్యక్రమాలను కుటుంబ సమేతంగా నిర్వహించారు. తదుపరి శివాలయంలో శివునికి అభిషేకం, అర్చన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ దత్తగిరి ఆశ్రమం అద్భుతంగా ఉన్నదని.. అలాగే చాలా శక్తివంతమైనదన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆశ్రమం మహా ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి దత్తగిరి అవధూత గిరి మహారాజ్, రిత్వికులు, పి.ఎం.ఆర్ యువసేన నాయకులు మరియు తాలెల్మ రాము, మనోజ్, అఖిల్, నరేష్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచే అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి జాతర

**నవతెలంగాణ-చౌటకూర్**

మండల కేంద్రంలో నేటి నుంచి(30 నుంచి ఏప్రిల్1) మూడ్రోజుల పాటు అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ జాతర అంగరంగ వైభవంగా జరగనున్నది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ పూజారి తీర్థాల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ యేడు ఉగాది పండుగను పురస్కరించుకొని మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఈ జాతరను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివారం పంచంగ శ్రవణం, సాయంత్రం బండ్లు తిరుగుట, రాత్రికి రథోత్సవం, సోమవారం ఊరి బోనాలు, రాత్రికి అగ్ని గుండాలు, మంగళవారం గోపాలకాల్వాలు, పాచి బండ్లు, రాత్రికి లంకాదహనం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ జాతరకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని మొక్కులను చెల్లించుకుంటారన్నారు.

## పల్లె సంపద వనాన్ని సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ

**నవతెలంగాణ-కొండపాక**



కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె సంపద వనాన్ని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండల ఎంపీడీఓ వెంకటేశ్వర్లు , కుకునూరుపల్లి ఇన్చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ , ఏపీఓ నరసింహారావు , సీటీఏ మహేందర్, ఏపీఓ, టీఏ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ట్రాన్స్ కో జర దేకో.....

- పచ్చిక కోసం వెళ్తే పశువులు మృత్యువాత

**నవతెలంగాణ-ములుగు**



మండల కేంద్రమైన ములుగు శివాలయం ఆలయం దగ్గరలో ఉన్న ఓ ట్రాన్స్ పార్మర్ చూట్టూ పచ్చగడ్డి ఉండటంతో మృత్యువుల మారింది. ట్రాన్స్ పార్మర్ గద్దె అతితక్కువ ఎత్తులో నిర్మించడంతో పచ్చిక కోసం పశువులు వేల్తే ప్రాణాలు పోతున్నాయి. విద్యుత్ షాక్‌కు గురై పశువుల ప్రాణాలు విడుస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై నవతెలంగాణ విలేఖరి విద్యుత్ అధికారి ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఈ విషయం మా దృష్టికి రాలేదు మా సిబ్బందితో ట్రాన్స్ఫార్మర్ చుట్టుకున్న మొక్కలన్ని తొలగిస్తామని, అదేవిధంగా గద్దె విషయం ఏడితో మాట్లాడి నిధులు మంజూరు చేయించి కొత్త గద్దె నిర్మిస్తామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పిచ్చిమొక్కలను తమ సిబ్బందితో తోలగించారు.

## వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

**నవతెలంగాణ-కొండపాక**



ఏప్రిల్ మొదటి వారంలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని మాత్ పల్లి, కాశనగర్ ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎండ్ లైన్ టెస్ట్ పేపర్లను దిద్దిన తర్వాతనే తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో సబ్మిట్ చేయాలన్నారు. పలు విషయాల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి టీములు పాఠశాలలను సందర్శించే అవకాశాలు ఉన్నాయని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉండేలా కృషి చేయాలని సూచించారు. సహాయ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

## మల్లన్న ఆలయ ప్రధాన అర్చకునికి ఉగాది పురస్కారం

**నవతెలంగాణ-కొమురవెల్లి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం రోజు వేద పండితులకు, అర్చకులకు, నాదస్వర విద్వాన్సులకు రవీంద్రభారతిలో ఉగాది పురస్కార అవార్డుల ప్రధానం జరుగుతుంది. ఈ పురస్కారానికి కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఎంపికయ్యారు. నేడు ఈ పురస్కారాన్ని రవీంద్రభారతిలో అందుకోనున్నారు.

## అనుమతులు లేకుండా కొండపోచమ్మ సాగర్ కాలువ కూల్చివేత



**నవతెలంగాణ-ములుగు**

ములుగు మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామ శివారులో గల కొండపోచమ్మ సాగర్ కాలువను అర్ధరాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎం .సందీప్ రెడ్డి, పి.ఎల్లం, పి.సంతోష్, జి.రాజు, ఎం.సురేందర్ రెడ్డి, ఎం. ఐలేని, జి.అశోక్, ఎం.రాజిరెడ్డిలు జేసీబీ సహాయంతో కూల్చేశారు. అది గమనించిన చుట్టుపక్కల రైతులు కాలువ ధ్వంసం చేసిన వ్యక్తులను అక్కడి నుంచి పంపించివేసి మరలా కాలువ బాగు చేసి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి, నీటిని వృధా చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

## ఉగాది చిత్రాన్ని ఆవిష్కరించిన రుస్తుం

**నవతెలంగాణ-సిద్ధిపేట**



ఉగాది పండుగను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు మానవ జీవితాన్ని కళావంతం చేస్తాయని, ప్రజల మధ్య ఐక్యమత్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, ఎండి రహీం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మహ్మద్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడికి పరామర్శ

**నవతెలంగాణ-బెజ్జంకి**



ప్రముఖ మండల పాత్రికేయుడు మండలోజు భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. శనివారం పలువురు మండల కాంగ్రెస్ నాయకులు మండలంలోని గూడెం గ్రామంలో బాధిత పాత్రికేయుడిని పరామర్శించారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండిపెల్లి రాజు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ జెల్లా ప్రభాకర్, నాయకులు పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఐలయ్య పరామర్శలో ఉన్నారు.

## బౌద్ధులు చేస్తున్న ఆందోళనకు మా మద్దతు

**నవతెలంగాణ-సిద్ధిపేట**



బుద్ధగయలో మహా బోధి విహార్ బౌద్ధుల ఆధీనంలో కాకుండా బ్రాహ్మణులు చేజిక్కించుకునే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని, దానికి వ్యతిరేకంగా బౌద్ధులు చేస్తున్న ఆందోళనకు మా మద్దతు ఉంటుందని సిద్దిపేటకు చెందిన బౌద్ధ సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పర మల్లేశం, జిల్లా అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షులు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రయ్య కుల సంఘం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాల దీక్ష

**నవతెలంగాణ-గజ్వేల్**



మేము కూడా భద్రాచల రామయ్య కళ్యాణానికి గోటి తలంబ్రాలు అందిస్తామని వీరభద్రయ్య కుల సంఘం వారు శనివారం తెలిపారు. గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొని రామనామాన్ని స్మరిస్తూ గోటితో వడ్లను ఓలిచి సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజుకు అక్కడే అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరబద్రయ్య కులసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## విరాళాల దాతలకు ధన్యవాదాలు



**నవతెలంగాణ-సిద్ధిపేట**

పట్టణంలోని నాసర్‌పురలో హనుమాన్ గుడికి విరాళంగా ముందుకొచ్చిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆలయ పూజారి అంజన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో గత 12 సంవత్సరాలుగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి కూడా విరాళాలు ఇచ్చిన దాతలు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు









**నవతెలంగాణ-అక్కన్నపేట**

మండల కేంద్రంలోని రామవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం అంబటి సిద్దయ్య ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలను శనివారం హట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షడ్రుచుల సమ్మేళనం, ఉగాది పచ్చడి, భక్ష్యాలను తయారు చేసి విద్యార్థులకు పంపిణి చేశారు. అనంతరం హెచ్ఎం అంబటి సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉగాది విశిష్టతను వివరించారు. శ్రీ విశ్వవసు నామ సంవత్సరం విద్యార్థులకు కలిసి రావాలని, ఉత్తమ ఫలితాలు సాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, వీరాస్వామి, కిషన్, సీఆర్పీ ఇందిరా, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

**నవతెలంగాణ-గజ్వేల్:** మంజీరా కాన్సెప్ట్ స్కూల్‌లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ముందస్తుగా నిర్వహించామని మంజీరా ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ అంబదాస్ తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు పండుగల విశిష్టతను నేటి తరం విద్యార్థులకు తెలియజేసే క్రమంలో ఈ ఉగాది వేడుకలను నిర్వహించామన్నారు. ముందస్తు ఉగాది వేడుకల అనంతరం తల్లిదండ్రులకు ఉగాది పచ్చడి, బక్షాలు, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అంబాదాస్, డైరెక్టర్ రజిత, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చౌదరి పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..** స్థానిక గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉగాది సంబురాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేష్ అధ్యక్షత వహించి, విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపి, ఉగాది పండుగ ప్రాధాన్యత గూర్చి వివరించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఆర్.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో షడ్రుచులు లాగా కష్టసుఖాలను కూడా సమంగా పంచుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కెప్టెన్ భవాని, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ అలివేలు, డాక్టర్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-నంగునూరు :** నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీశ్ కుమార్ మాట్లాడుతూ.. అనాదిగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలని, ఉగాది విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని ముందస్తుగా పాఠశాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, ఎం.డి హర్షద్, బి .యాదగిరి, సునీత, లలిత తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-గజ్వేల్ రూరల్:** గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో స్కూల్ హెచ్ఎం మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం స్కూల్ ఆవరణలో ఉగాది పచ్చడి చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలను కంటికి కట్టునట్లుగా కనిపించేదే ఉగాది పండుగన్నారు. అలాంటి పండుగను చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా విద్యార్థులతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు తయారుచేసిన షడ్రుచుల సమ్మేళనం తీపి అరు రుచుల ఉగాది పచ్చడిని ఆకుల దోప్పలలో స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ, రాజేశ్వరి, కళ్యాణి,సి ఆర్ పి రమేష్, ఆయాలు రమ, రాజమణి వంట కార్మికులు నరసమ్మ రాములమ్మ పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుండి ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పాదయాత్ర

-కాంగ్రెస్ చిన్నకోడూరు మండలాధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్

**నవతెలంగాణ-సిద్దిపేట**



రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఏప్రిల్ 2 నుంచి ప్రతి గ్రామంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ చిన్నకోడూరు మండలాధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటింటికీ వివరించనున్నట్లు తెలిపారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో, మండల కేంద్రాలలో, గ్రామ స్థాయిలో నిర్వహించే పాదయాత్ర గురుంచి నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరీ కృష్ణ ఆధ్వర్యంలో చర్చించడం జరిగిందని తెలిపారు. పాదయాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల కోర్డినేటర్లు సాకి ఆనంద్, మొహమ్మద్ షాబోద్దీన్, ఉప అధ్యక్షులు సందబోయిన పర్షరం, పొన్నాల రాజేష్, ప్రశాంత్, నముండ్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

- పోలీస్ కమిషనర్ డా. బి. అనురాధ.

**నవతెలంగాణ-రాయపోల్, దౌల్తాబాద్**



యువత డ్రగ్స్, గంజాయి, చెడు వ్యసనాలకు ప్రలోభపడి వారి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోద్దని, డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్నామని ప్రజలు శాంతిభద్రతలు కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను నియంత్రించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డా.బి.అనురాధ అన్నారు. శనివారం రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లను సందర్శించి పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..మండలంలో బెల్టు షాపులను తొలంగిచాలన్నారు. స్పీడ్ బ్రేకర్, స్టాపర్లు ఏర్పాటు చేయాలని, గజ్వేల్- చేగుంట రోడ్డు మార్గంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచి నియంత్రించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పోలీసులు ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ బెట్టింగ్ వాటిపై నిఘా పెంచాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు, పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సిడి ఫైల్స్, తనిఖీ చేశారు.ప్రతి రికార్డ్ అప్డేట్ ఉండాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. విజబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని ఉదయం, సాయంత్రం విసిబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. డ్రగ్స్ దాని ప్రభావం, సైబర్ నేరాలు తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, తొగుట సిఐ లతీఫ్, సీసీఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్లు శ్రీధర్ గౌడ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి, సీసీ నితిన్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు

## జాతీయ ప్రతిభ నంది అవార్డు అందుకున్న పిన్నింటి రత్నం

**నవతెలంగాణ-కొమురవెల్లి**



మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు సాంస్కృతిక సారధి పిన్నింటి రత్నం జాతీయస్థాయి ప్రతిభా నంది అవార్డు పురస్కారం దక్కింది. హైద్రాబాద్‌లో బీ.ఎం. బిర్లా సైన్స్ మ్యూజియం ఆడిటోరియంలో అవార్డు పురస్కారం ప్రశంసపత్రం సినీనటులు ఆందోలు మాజీ శాసనసభ్యులు బాబుమోహన్, ఆర్గనేజర్ శిరీషరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పిన్నింటి రత్నం మాట్లాడుతూ.. మేగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న కళాకారుల ప్రతిభను గుర్తించి అవార్డులకు ఎంపిక జరుగుతుంది. గత ముప్పై సంవత్సరాల నుంచి కళారంగ సేవలకు గుర్తింపుగా తెలంగాణ ఉద్యమ ధూమ్ ధామ్ గాయకునిగా సామాజిక రుగ్మతలపైన సాంస్కృతిక నేపత్యం ప్రభుత్వ పథకాల పాటలు ప్రజలను చైతన్య పరచడంతో 2025 సంవత్సరముకు ఈ అవార్డు ఎంపిక చేశారని తెలిపారు. ఈ ప్రతిభ నంది పురస్కారము రావడంపట్ల సిద్దిపేట జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులు సాహితీ వేత్తలు, గ్రామస్తులు హర్షంవ్యక్తం చేశారు.

## విజయం, జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు

- మండల విద్యాధికారి వెంకట్ రాములు

**నవతెలంగాణ-మర్కుక్**



విజయం, జ్ఞానం అనేది ఏ కొక్కరి సొత్తు కాదని, కడు పేదరికంలో జన్మించి కష్టాలని సైతము ఇష్టాలుగా మార్చుకొని చదువే ధ్యేయముగా జ్ఞానమే సర్వస్వముగా వెలిసి నిరూపించిన సరస్వతి దేవి మన అశ్విని అని మర్కుక్ విద్యాధికారి వెంకట రాములు అన్నారు. శనివారం పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు వై.చిన్న బ్రహ్మయ్యను విద్యార్థి అశ్వినిని ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని దామరకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని వరగంటి అశ్విని 9వ తరగతి ఇటీవల చెన్నైలో నిర్వహించిన భౌతిక రసాయన శాస్త్ర కాంపిటీషన్ పోటీలో పాల్గొని 125 మూలకాలను సంకేతాలతో సహా 58 సెకండ్స్ లో పూర్తిచేసి వరల్డ్ లోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వెంకట రాములు మాట్లాడుతూ.. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అందించిన జ్ఞానాన్ని మోసి, 125 మూలకాలను సంకేతాలతో అతి తక్కువసమయంలో ప్రదర్శన చేసిన అశ్విని జ్ఞానం అద్భుతం అన్నారు. సంకేతాలతో సహా కేవలం 58 సెకండ్స్ లలో పూర్తిచేసి అంతర్జాతీయ స్థాయికి దామరకుంట గ్రామ పాఠశాల కీర్తి ప్రతిష్ఠలను పెంచిందన్నారు. అందరమూ అశ్వినికి చేయూత నిద్దాము, ఇలాంటి ఆణి ముత్యాన్ని తయారు చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందంకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు

# తండ్రి కలను నెరవేర్చిన తనయ

**నవతెలంగాణ-తొగుట**

తండ్రి తమ పిల్లల గురుంచి ఎన్నో కలలు కంటారు. వాటి సాకారం కోసం సర్వస్వం దారపోస్తుంటారు. తన బిడ్డ డాక్టర్ కావాలని ఓ తండ్రి ఎన్నో కలలు కన్నాడు. బిడ్డ కోసం ఎంతో శ్రమించాడు. తండ్రి శ్రమకు తగ్గట్టుగా కుమార్తె కూడా అహర్నిశలు శ్రమించింది. తండ్రి ఆకస్మాత్తుగా దూరమైనా తండ్రి కన్న కలల సాకారం కోసం కృషి చేసింది. తండ్రి పోతరాజు యాదగిరి లేని లోటును తల్లి భాగ్య అన్ని తానై నెరవేర్చింది. శనివారం ఆ కుమా ర్తె డాక్టర్ పూర్తి చేసి పట్టా అందుకుంది. తండ్రికి అంకితమిచ్చింది.

మండలంలోని వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన పోతరాజు యాదగిరి దంపతులది పేద కుటుంబం. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కూలీ పనులతో కుటుంబాన్ని పోషించేవారు. తన కూతురు డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ఉన్నత చదువులు చదివించాడు. గత మూడు, నాలుగ ఏండ్ల క్రితం తండ్రి యాదగిరి ఆకాల మరణం చెందారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయిన చదువు మాత్రం మానలేదు. కూతురు చదువు తల్లిపై పడగా తల్లి భాగ్యధైర్యంతో ఎంబిబిఎస్ చదివించింది. యాదగిరి మృతి చెంది నప్పుటి నుంచి హైదరాబాదులో నివాసం ఉంటు కూలీ పనులు చేస్తూ కూతురును బాగా చదివించింది. నాలుగేళ్ల ఎంబీబీఎస్ పూర్తి కావడంతో శనివారం మమత అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్ వారు శ్వేతకు డాక్టర్ పట్టాను అందించారు. డాక్టర్ పట్టా అందుకోవడం వల్ల ఆ కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా శ్వేత నానమ్మను-తాతలను గ్రమస్థులు శాలువాతో సత్కరించారు.

### ఇలాంటి స్ఫూర్తి అందరూ తీసుకోవాలి

-డాక్టర్ శ్వేత



పేదరికం అడ్డుపెట్టుకొని చదువులో వెనక్కి తగ్గడం అంటే అది మన బలహీనతే తెలిపారు. ఆర్థిక సమానత్వం రావాలి అంటే కష్టపడి ముందుకు సాగాల్సిందే అని సూచించారు. బావితరాలకు చదువును మించిన భవిష్యత్ లేనే లేదని హితవు పలికారు. పేదలకు తనవంతు వైద్య సేవలు అందిస్తానని అన్నారు.

## మంచి ఉద్యోగిగా రాణించాలంటే కుటుంబ సభ్యుల సహకారంవసరం

- ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్

**నవతెలంగాణ-సిద్దిపేట**

మంచి ఉద్యోగిగా రాణించాలంటే కుటుంబ సభ్యుల సహకారం అవసరమని ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్ అన్నారు. నీటిపారుదలశాఖ డివిజన్-3 కార్యనిర్వాక ఇంజనీర్ శ్రీనివాస్ పదవి విరమణ కార్యక్రమం రంగనాయక సాగర్ అతిథి గృహంలో జరిగింది. ఇంజినీర్లు, ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధినిర్వహణలో ఎదురైన ఎన్నో సవాళ్లను తన అకుంఠిత కార్యదక్షతతో ఎదుర్కొని, తన అఖండమైన మేధోసంపత్తితో, నిరంతర పర్యవేక్షణతో, అసాధ్యాలను కూడా సుసాధ్యాలుగా చేసి, చిరస్మరణీయమైన ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో తన జీవితాన్ని అంకితంచేసి పదవీవిరమణ పొందుతున్న శ్రీనివాస్, శేష జీవితం ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో గడపాలని కోరుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నేత్రపర్వం..నాచగిరి లక్ష్మీనరసింహుడి రథోత్సవం

-రమణీయంగా కొనసాగిన నాచాగిరీషుడి రథోత్సవం

- తిరుమాడ విధుల్లో ఊరేగిన స్వామివారు

**నవతెలంగాణ-వర్గల్**





నాచాగిరి శ్రీ లక్ష్మీ నరసింహుడి రథోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం తర్వాత గరుడ, గజ, పొన్న, శేష, హంస, ఇలా తొమ్మిది రోజుల పాటు వివిధ వాహనాల్లో ఊరేగిన స్వామివారు శనివారం తన ప్రధాన వాహనమైన రథంపై విహరిం చాడు. తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతుండగా, శనివారం తెల్లవారు జామున నిర్వహించిన స్వామివారి విమాన రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ శర్మ నేతృత్వంలో స్వామి వారి విమాన రథోత్సవ ఏర్పాట్లు నిర్వహించగా, శుక్రవారం అర్ధరాత్రి దాటాక వేద పండితులు, ఆలయ అర్చకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విమాన రథంపై సతీసమేతులైన శ్రీ స్వామి వారిని అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుం టా నర్సారెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు దాతల సహకారంతో మహా ప్రసాదం అందజేశారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించ డానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా అవాంఛనీ య సంఘటనలు జరగకుండా పోలీస్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

## కాల గమనం... కష్ట సుఖాల సంగమం

**నవతెలంగాణ-గజ్వేల్**



**తీపి:** ఆనందాలు, సుఖాలు మన జీవితంలో తీపి వంటివి. రోజు వారి ప్రయాణంలో తీపి ఎంత ఎక్కువుంటే జీవితం అంత సాఫీగా సాగిపోతుంది. **చేదు:** బాధ కలిగించే విషయాలు, జీవితంలోని కష్టాలు, బంధుత్వాలు తెగిపోవడం, ఇతర మనస్పర్దలు ఉగాది పచ్చడిలోని చేదు లాంటివే. ఇవి చేదుగానే ఉన్నా మనకు పాఠాలు నేర్పిస్తాయి.

**పులుపు:** ఏ పదార్థంలో అయినా పెరిగిన పులుపు తగ్గించేందుకు మరో పదార్థాన్ని జోడిస్తాం. జీవితంలో ఎదురయ్యే కొత్త సవాళ్లు, కొన్ని సంఘటనలు ఇబ్బంది పెట్టినా, నచ్చకపోయినా వెనకడుగు వేయకూడదు. వాటికి తగ్గట్టు సర్దుకుపోవడమో, లేదా వాటిని ఎదురించి మనకు అనుకూలంగా మలుచుకోవడమో చేయాలి. **కారం:** కొన్ని సందర్భాల్లో ఎదురయ్యే కోపం అలాంటిదే. అలాగని దాన్ని అదుపులో పెట్టుకోకపోతే పరిస్థితులు ప్రతికూలంగా మారతాయి. పచ్చడిలో కారం ఎంతుండాలో అంతుంటేనే రుచి. కోపం కూడా అంతే కొంత వరకే ఉండాలి.

**వగరు:** ఉగాది పచ్చడిలోని మామిడి వగరుగా ఉన్నా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జీవితం కూడా అంతే. కొన్ని సందర్భాలు అనుకోకుండా ఎదురై మానసిక సంతోషాన్ని కలిగిస్తాయి.

**ఉప్పు:** ఉప్పులేని ఏ పదార్థం అయినా చప్పగానే, రుచీపచీ లేకుండా ఉంటుంది. చదువు, ఉద్యోగం, ఇతర బాధ్యతలు, ఇవన్నీ ఎప్పుడూ ఉండేవే. వాటిలోనే మునిగిపోతే, యాంత్రికత తప్ప మరేమీ ఉండదు.

# గజ్వేల్ ప్రైవేట్ ఆస్పత్రిలో పసిపాప మృతి

**ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం అంటున్న తల్లిదండ్రులు**
**రాయపోల్ గ్రామానికి చెందిన పసిపాప మృతి**
**అర్ధరాత్రి వరకు మృతదేహంతో ఆస్పత్రిలో ధర్నా**

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఆస్పత్రి నిర్లక్ష్యమో వయస్సు తీరిందో కానీ అభం శుభం తెలియని పసికందు మృత్యువాత పడింది. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం చోటు చేసుకుంది కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రాయపోల్ పట్టణ కేంద్రానికి చెందిన శ్రీకాంత్-ఉమారాణి దంపతుల 4 నెలల పాప ఉంది. గత వారం రోజుల క్రితం గజ్వేల్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు నిమోనియా సోకిందని వైద్యులు నిర్ధారించారు ప్రతిరోజు వేలల్లో ఖర్చవుతుంది పాపను బ్రతికించుకునేందుకు తల్లిదండ్రులు తమకున్న పశువులను అమ్మివేశారు. వచ్చిన డబ్బుతో వైద్యం అందిస్తున్నారు. పాప ఆరోగ్యం నిలకడగా ఉందని శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికి చేరుకొని చూడగా పాప ఉలుకు పలుకు



లేకుండా ఉందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాప మృతికి ఆసుపత్రి యాజమాన్యం కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి సామాగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు



సేకరిస్తున్నారు. మాకు న్యాయం జరిగేంత వరకు ఆసుపత్రి నుంచి కదిలేదే లేదని చిన్నారి మృతదేహంతో రాత్రి 12 గంటల వరకు రాయపోల్ గ్రామస్తులు ఆస్పత్రిలో ధర్నా నిర్వహించారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ 43 ఏళ్లుగా తెలుగు ప్రజలు తమ గుండెల్లో పెట్టుకున్న పార్టీ మన తెలుగుదేశం పార్టీ అన్నారు. 'అన్న' నందమూరి తారకరామారావు దివ్య ఆశీస్సులతో సంచలనంగా ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. కార్యకర్తల తిరుగులేని పోరాటం, నిబద్ధత, త్యాగగుణం. పీకపై కత్తిపెట్టినా 'జై తెలుగుదేశం' నినాదం తప్ప వేరే మాట వినిపించని గొంతుక కార్యకర్తలదన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ టౌన్ ప్రెసిడెంట్ వరియోగుల శ్రీనివాస్, భీమదేవరపల్లి మండల అధ్యక్షులు ఎదులాపురం శంకర్, నాయకులు షారుఖ్ ఎండి హసన్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా శనీశ్వర స్వామి ప్రత్యేక తిలా తైలాపూజలు

నవతెలంగాణ-కొండాపూర్



శని అమావాస్య సందర్భంగా మండలంలోని మాందాపూర్ గ్రామ శివారులోని శనేశ్వర ఆలయంలో శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి శనీశ్వరునికి తైలాభిషేకాలు చేశారన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఇఫ్తార్ విందులో ఉర్దూకు స్థానం ఎక్కడ

నవతెలంగాణ-సిద్దిపేట



పూర్తి సెక్యూలర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎక్కడ కూడా ఉర్దూ భాష కనిపించలేదని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ మొయిజ్ మండిపడ్డారు. శనివారం ఆయన సిద్దిపేటలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత కెసిఆర్ ఉర్దూను రెండవ అధికారిక భాషగా ప్రకటించారు, కానీ ప్రభుత్వం పరంగా నిర్వహించిన అధికారిక కార్యక్రమం లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లో ఉర్దూ భాష ను చిన్న చూపు చూడటం సమంజసం కాదని అన్నారు. ఈ సమావేశం లో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు అదాబ్ మోయిజ్, అహ్మద్,షౌకత్, గోరేమియా, కలీం, గౌస్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## మహిళ రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



మహిళల రక్షణ చట్టాలపై ప్రతి ఒక విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ సిఐ బి.సైదా అన్నారు.శనివారం ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థినీలకు మహిళల హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మహిళల రక్షణకు చట్టాల, సైబర్ నేరాల, గుడ్ టచ్ బాడ్ టచ్, తదితర అంశాల గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, నార్కోటిక్ డ్రగ్ ఏసిపి పుష్ప కుమార్, ఇన్స్పెక్టర్ రామ్ నాయక్, గజ్వేల్ షీటీమ్ బృందం,స్కూల్ ప్రిన్సిపల్ రాయప్ప, కరస్పాండింగ్ విజయపాల్ రెడ్డి,ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ లావణ్య , కానిస్టేబుల్ మహేష్, పాల్గొన్నారు.

## చేగుంటలో ఇఫ్తార్ విందు

• హాజరైన చెరుకు శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రంలో రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం రాత్రి పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింప చేశారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఇఫ్తార్ విందులలో తాము పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని, మనమంతా



భిన్నత్వంలో ఏకత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీకాంత్, ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి, ముస్లిం సోదరులు, రెడ్డిపల్లి మాజీ సొసైటీ చైర్మన్ తాడెం వెంగళరావు, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో బీజేపీ మెదక్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులకు ఘన సన్మానం

• మున్సిపల్ అధ్యక్షులు భూమన్న జానకిరామ్ గౌడ్

నవతెలంగాణ-తూప్రాన్

భారతీయ జనతా పార్టీలో నూతనంగా ఎన్నికైన బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్‌లను తూప్రాన్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో తూప్రాన్‌కు ఆహ్వానించి, ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్, మనోహరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు పార్టీ ఐక్యత, బలాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మెదక్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులను శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో బీజేపీ విజయంపై జిల్లా అధ్యక్షులు విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానికంగా పార్టీ విజయాలు సాధించడంలో మెదక్



ఎంపీ రఘునందన్ రావు బలమైన మద్దతును ఉంటుందని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు చెప్పారు. పార్టీ గ్రామ స్థాయిలో గల్లి నుంచి ఢిల్లీ వరకు అన్ని స్థాయి ఎన్నికలలో విజయం సాధించి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలకు బహుమతిగా ఇవ్వాలని, ప్రతి కార్యకర్తకు బీజేపీలో గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ స్థానిక ఎన్నికలలో బాధ్యతగా వ్యవహరించి ఓట్లు వేయించారు. కార్యకర్తలందరికీ భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకుడు దుర్గారాజ్ యాదవ్, సీనియర్ నాయకులు తాటి విఠల్, కాళ్లకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్, ఆర్.మహేష్‌గౌడ్, సర్గం మురళి, జే.సాయిబాబాగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శరత్ నరసింహారెడ్డి రసమల్లు వెంకట్, బీజేవైఎం టౌన్ అధ్యక్షులు కార్తిక్, సంతోష్ ,బద్రి, ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గిరి, తూప్రాన్ మాజీ మండల అధ్యక్షులు సిద్దిరాములు యాదవ్, సాయిబాబా యాదవ్, గట్టు అమర్, పసుల మహేష్, శేఖర్, నవీన్,పాల్గొన్నారు.

## సర్వ మతాల సారం ఒక్కటే..

నవతెలంగాణ-సంగారెడ్డి

సర్వమతాల సారం ఒక్కటే అని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ముస్లిం ఉపాధ్యాయ సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ హిందూ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. భారతదేశం సర్వ మతాల సమ్మేళనం, సోదరత్వానికి సౌభ్రాతృత్వానికి, లౌకికత్వానికి పునాది అన్నారు. అత్యంత పవిత్రంగా నెలరోజులపాటు పచ్చి మంచినీళ్లు సైతం తీసుకోకుండా ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో దావత్ -ఇ - ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ.. సర్వమతాల సారం ఒకటేనని, అందరూ కలిసి మెలసి ఉన్నప్పుడే సమాజం బాగుంటుందని, దైవభక్తితో, దైవభీతితో సమాజంలో మెలిగినప్పుడే మానవుడు ఎటువంటి తప్పులు చేయకుండా ఉంటారన్నారు. అన్ని




మతాలకు, అన్ని వర్గాలను సమానం దృష్టితో పాలకులు, ప్రజలు నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ లింబాజీ, ఎంఈఓలు వెంకట నరసింహులు, జాఫర్, సీనియర్ నాయకులు హఫీజ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, వివిధ మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయం

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్**

నవతెలంగాణ-సిద్దిపేట

అన్ని వర్గాల సంక్షేమమే భారతీయ జనతా పార్టీ ధ్యేయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ స్పష్టం చేశారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకొని 17 వ వార్డు లోని ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు ముస్లింలు స్నేహ భావంతో పండుగలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. హిందు బంధువులకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సందీప్ , అజేయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

